





సమావేశంలో మాట్లాడుతున్న ఎస్పీ ఉమామహేశ్వర్

గంజాయి కట్టడికి నిఘా

● ప్రమాదాల నియంత్రణకు చర్యలు ● ఎస్పీ ఉమామహేశ్వర్

బాపట్ల, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): గంజాయి అక్రమ రవాణా, విక్రయాలు జరగకుండా పటిష్ఠంగా నిఘా ఉంచాలని ఎస్పీ ఉమామహేశ్వర్ తెలిపారు. ఎస్పీ క్యాంప్ కార్యాలయంలో గురువారం జరిగిన నేరసమీక్షలో ఆయన అధికారులకు పలు ఆదేశాలు జారీ చేశారు. రౌడీషీటర్లు, చెడు నడత కలిగిన వ్యక్తుల కదలికలపై నిరంతర నిఘా ఉంచాలన్నారు. గంజాయి వంటి మత్తు పదార్థాల వల్ల కలిగే అనర్థాల గురించి విద్యార్థులకు అవగాహన కల్పించాలన్నారు. గతంలో నేరాలకు పాల్పడి ప్రస్తుతం కూడా చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడే అవకాశం ఉన్న వారిపై అవసరమైతే పీడీయాక్ట్ అమలు చేయాలని ఆదేశించారు. మహిళలకు సంబంధించిన చట్టాలు గురించి, యాప్ పనితీరు గురించి శక్తిబృందాలు అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. రోడ్డుప్రమాదాల కట్టడికి ముందస్తు చర్యలు తీసుకోవాలన్నారు. సమావేశంలో డీఎస్పీలు జి.రామాంజనేయులు, ఎండీ మోయిన్, ఎ.శ్రీనివాసరావు, పి.జగదీష్‌నాయక్, పి.బాలమురళీకృష్ణ, సీఐలు, ఎస్‌ఐలు తదితరులు పాల్గొన్నారు.



సభలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు

కష్టపడిన వారికి సముచిత స్థానం

● రాష్ట్రాభివృద్ధి, పార్టీ బలోపేతమే అందరి లక్ష్యం
● టీడీపీ కమిటీల ప్రమాణ స్వీకారంలో ఎమ్మెల్యే ఏలూరి

పర్చూరు/మార్టూరు, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): కష్టపడే ప్రతీ కార్యకర్తకు సముచితమైన స్థానం, గౌరవం ఉంటుందని ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు తెలిపారు. గురువారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో పర్చూరు నియోజకవర్గ మండల క్లస్టర్, యూనిట్, గ్రామ, బూత్ కమిటీల ప్రమాణ స్వీకారోత్సవం నిర్వహించారు. తొలుత ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. అనంతరం టీడీపీ జెండాను ఎమ్మెల్యే ఆవిష్కరించారు. కేక్ కట్‌చేసి నూతన కమిటీ సభ్యులకు ఎమ్మెల్యే శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో ఆయన మాట్లాడుతూ పార్టీ విజయం కోసం ప్రతీ కార్యకర్త కృషి చేశారన్నారు. కార్యకర్తలకు భవిష్యత్‌లో తప్పకుండా గౌరవం లభిస్తుందన్నారు. రాష్ట్రాభివృద్ధి, పార్టీ బలోపేతమే అందరి లక్ష్యం కావాలన్నారు.

వైసీపీ దుష్ప్రచారాన్ని తిప్పికొట్టాలి..

వైసీపీ చేస్తున్న దుష్ప్రచారాన్ని తిప్పి కొట్టాలన్నారు. పార్టీ సిద్ధాంతాలను ప్రజల్లోకి తీసుకుపోవాలన్నారు. త్వరలో జరగబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో విజయమే లక్ష్యంగా పనిచేయాలని తెలిపారు.

రూ.కోట్లతో అభివృద్ధి పనులు

నియోజకవర్గంలో రూ.80 కోట్లతో సీసీ రోడ్లు, రూ.8 కోట్లతో గోకులాలు, రూ.60 కోట్లతో ఆర్అండ్‌బీ రోడ్లు, రూ.16 కోట్లతో పీఐయూ రోడ్లు, 1170 మందికి రూ.10 కోట్లతో సీఎంసహాయనిధి, రూ.3 కోట్లతో కేడబ్ల్యూడీ అభివృద్ధి, కోటిన్నతో ఎస్‌ఎస్పీ కాల్వలు, రూ.3.50 కోట్లతో డ్రెయినేజ్ అభివృద్ధి కార్యక్రమాలను చేపట్టినట్లు తెలిపారు. రాష్ట్ర కార్పొరేషన్ డైరెక్టర్లు తిరుమలశెట్టి శ్రీహరి, షేక్.షంషుద్దీన్, కారుమంచి వెంకటకృష్ణ(కృష్ణ), కోడూరి శేషబ్రహ్మాచారి, హుస్సేన్‌లను సత్కరించారు. ఈ కార్యక్రమంలో పర్చూరు వ్యవసాయ మార్కెట్ చైర్మన్ గుంజి వెంకట్రావు, పార్టీ మండల అధ్యక్షులు తాటి నాగేశ్వరరావు, నాయుడు హనుమంతురావు, నల్లపునేని రంగయ్య చౌదరి, షంషుద్దీన్, శ్రీహరి తదితరులు పాల్గొన్నారు.

నిర్లక్ష్య ధోరణిపై కన్నెర్ర

● అధికారులకు కలెక్టర్ మెమోలు



భక్త కనకదాసు జయంతి వేడుకల్లో కలెక్టర్ వినోద్‌కుమార్ (ఫైల్ ఫొటో)

(బాపట్ల, ఆంధ్రజ్యోతి)
సమావేశం.. అధికారిక కార్యక్రమాలు ఏవైనా కొందరు అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. చివరకు కలెక్టర్ పాల్గొనే కార్యక్రమంలోనూ అదే తీరుగా కొందరు ఉన్నారు. దీంతో నిర్లక్ష్య అధికారులపై కలెక్టర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. రెండు వారాల వ్యవధిలో రెండు సార్లు ఆయా విభాగాల అధికారులు కలెక్టర్ పాల్గొనే కార్యక్రమాల్లోనూ నిర్లక్ష్యం ప్రదర్శించారు. కలెక్టర్ వినోద్‌కుమార్ సమయపాలన కచ్చితంగా పాటిస్తున్నా కొందరు తమ పాత ధోరణి వీడటంలేదు. ఈ క్రమంలో సమయపాలన పాటించని అధికారులపై కలెక్టర్ మెమోలతో కొరడా ఝుళిపిస్తున్నారు. రెండు వారాల వ్యవధిలో పదుల సంఖ్యలో అధికారుల కు మెమోలు జారీ చేశారు. ఎస్సీ, ఎస్టీ, దివ్యాంగుల పీజీఆర్‌ఎస్‌కి కలెక్టర్ వినోద్‌కుమార్ హాజరైన అరగంట తర్వాత సంబంధిత విభాగాలు హాజరుకావడంతో వారి వివరణ కోరుతూ మెమోలను గతంలో జారీ చేశారు. ఇది జరిగిన రెండు వారాల వ్యవధిలోనే, తాజాగా ఈ నెల 8న కలెక్టరేట్ వేదికగా అధికారికంగా జరిపిన శ్రీభక్త కనకదాసు జయంతి వేడుకల్లోనూ అదే నిర్లక్ష్యం పునరావృతమైంది. ఈ సారి ఏకంగా దాదాపు పది మంది జిల్లా అధికారులను వివరణ కోరాలని కలెక్టర్ ఆదేశించినట్లు సమాచారం.

◆ నగదు కోసం రైతుల ఎదురుచూపులు
◆ కొనుగోళ్లు నిలుపుదల చేసిన మార్క్‌ఫెడ్
◆ నాలుగు నెలలుగా పలువురు రైతులు నిరీక్షణ
◆ మొంథా నష్టం.. అదనపు కొనుగోళ్లపై రాని స్పష్టత

బర్లీ బకాయిలు రూ.38 కోట్లు

ఆందోళనలో ఉన్న బర్లీ పొగాకు రైతులను గట్టెక్కించేందుకు ప్రభుత్వం రంగంలోకి దిగి మార్క్‌ఫెడ్ ద్వారా కొనుగోళ్లు చేసింది. నిధులకు ఇబ్బంది లేకుండా రూ.250 కోట్లు కూడా కేటాయించింది. ఆత్మహత్యలే శరణ్యమనే భావనలో ఉన్న బర్లీ సాగుదారులు ప్రభుత్వ చర్యలపై ఆనందం వ్యక్తం చేశారు. అయితే నాలుగు నెలలు అవుతున్నా పలువురు రైతుల ఖాతాల్లో బర్లీ నగదు జమ కాలేదు. మార్క్‌ఫెడ్ కొనుగోళ్లను కూడా నిలిపేసింది. అయినా ఇంకా బాపట్ల, పల్నాడు, గుంటూరు జిల్లాతో పాటు ప్రకాశం జిల్లాకు సంబంధించి ఇంకా రూ.38 కోట్ల వరకు బకాయిలు ఉన్నాయని సమాచారం. కొనుగోళ్లు ప్రారంభంలో పొగాకును మార్క్‌ఫెడ్ కేంద్రాల్లో విక్రయించినా తమకు ఇంకా నగదు జమ కాలేదని కొందరు రైతులు వాపోతున్నారు. కాగా ప్రభుత్వం రైతుల నుంచి పూర్తిగా బర్లీ పొగాకు నిల్వలను కొనుగోలు చేస్తామని ప్రకటించింది. కానీ పలువురు రైతుల వద్ద ఇంకా పొగాకు నిల్వలు ఉన్నా కొనుగోళ్లను మార్క్‌ఫెడ్ నిలిపేసింది. ఈ పరిస్థితుల్లో కొనుగోళ్లను కొనసాగించాలని ఒకవైపు రైతులు అభ్యర్థిస్తుండగా ప్రభుత్వం ఎటూ తేల్చలేదు. పైగా ఇటీవల వర్షాలతో బర్లీ రైతులు నష్టపోగా పరిహారంపై స్పష్టత లేకపోవడంతో వారు ఆందోళన చెందుతున్నారు.

(బాపట్ల, ఆంధ్రజ్యోతి)
మూడు వారాల క్రితం బర్లీ పొగాకు కొనుగోళ్లను మార్క్‌ఫెడ్ నిలుపుదల చేసింది. అయితే బకాయిల జమ విషయం, రైతుల వద్ద ఇంకా నిల్వ ఉన్న పొగాకు విషయంపై అటు ప్రభుత్వం, ఇటు మార్క్‌ఫెడ్ ఎటూ తేల్చడంలేదు. కొనుగోళ్ల ప్రారంభం నుంచి కూడా పలువురు రైతులకు నగదు జమ కాలేదని సమాచారం. మొత్తంగా చూస్తే బాపట్ల, పల్నాడు, గుంటూరు, ప్రకాశం జిల్లాల పరిధిలో రూ.38 కోట్లు రైతుల ఖాతాల్లో జమ చేయాల్సి ఉంది. కాగా ఇందులో ఒక్క బాపట్ల జిల్లాకు సంబంధించే రూ.30 కోట్ల వరకు బకాయిలు ఉన్నాయి. అయితే రూ.100 కోట్ల వరకు రైతుల (మిగతా 6వ పేజీలో)



కలెక్టర్ వినోద్‌కుమార్‌కు తమ గోడు వెళ్లబోసుకుంటున్న బర్లీ రైతులు (పాత చిత్రం)

తాజాగా కలెక్టర్ దృష్టికి...

బర్లీ పొగాకు కొనుగోళ్లకు సంబంధించి డబ్బులు ఇంకా తమ ఖాతాల్లో జమ అవలేదని పర్చూరు పర్యటనలో భాగంగా పలువురు బాపట్ల కలెక్టర్ వినోద్‌కుమార్ దృష్టికి తీసుకెళ్లారు. తుఫాన్ తమను మరింతగా కుంగదీసిందని బర్లీకి జరిగిన నష్టంపై కూడా పరిహారం అందించాలని రైతులు కలెక్టర్‌ను అభ్యర్థించారు. పంట నష్టం జాబితాలో బర్లీకి చోటు కల్పించడానికి కొన్ని సాంకేతిక పరమైన చిక్కులు అవరోధంగా ఉన్నాయని, బకాయిల అంశాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి వీలైనంత త్వరగా న్యాయం జరిగేలా చూస్తానని కలెక్టర్ రైతులకు హామీ ఇచ్చారు.



షాక్ నుంచి ఊరట

● యూనిట్‌కు 13 పైసలు తగ్గింపు
● ఈ నెల నుంచే అమల్లోకి ట్రూడౌన్
● విద్యుత్ వినియోగదారులకు రూ.32 కోట్లు లబ్ధి

గుంటూరు, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): గతంలో ట్రూ అప్ చార్జీలతో కరెంటు బిల్లులు షాక్ కొట్టాయి. వినియోగించిన విద్యుత్‌కు వచ్చే బిల్లుకు పొంతన లేక వినియోగదారులు అల్లాడిపోయారు. ఎప్పుడో.. ఎవరో వినియోగించిన విద్యుత్‌కు తమపై ఈ భారం ఏమిటంటూ అద్దె ఇళ్లలోని వారు ఆగ్రహం కూడా వ్యక్తం చేశారు. అయితే ఇలాంటి వారికి కూటమి ప్రభుత్వం తీపి కబురు చెప్పింది. గత ఎన్నికల ప్రచారంలో విద్యుత్ బిల్లుల భారం నుంచి ఉపశమనం కల్పిస్తామని హామీ ఇచ్చినట్లుగా కొంత ప్రయత్నాలు జరుగుతున్నాయి. ఈ క్రమంలో ఈ నెలలోనే ట్రూ డౌన్ చేస్తూ బిల్లుల్లో ఆ మేరకు నగదు మినహాయించారు. గతంలో షాక్ కొట్టేలా ఉన్న కరెంటు బిల్లులకు ఇప్పుడు కొంత మేరు ఉపశమనం కల్పిస్తూ ఉన్న బిల్లులను చూసి వినియోగదారులు కొంత ఆనందం వ్యక్తం చేస్తున్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఎఫ్‌పీపీసీఏ చార్జీలలో ట్రూ డౌన్ పేరుతో యూనిట్‌కు 13 పైసలు తగ్గింపు ప్రక్రియ ఈ నెల నుంచే అమల్లోకి వచ్చింది. ఇంధన, విద్యుత్ కొనుగోలు ఖర్చు సర్దుబాటు (ఎఫ్‌పీపీసీఏ) ట్రూ డౌన్ రీఫండ్ అమలు కోసం 2024 ఏప్రిల్ నుంచి 2025 మార్చి వరకు వినియోగించిన యూనిట్లకు 13 పైసలను తిరిగి బిల్లుల్లో జమ చేయనున్నారు. వచ్చే ఏడాది అక్టోబరు వరకు ఈ ప్రక్రియ జరగనున్నట్లు ఇంధన సంస్థలు ప్రకటించాయి. గత ఏడాది ఏప్రిల్ నుంచి 2025 మార్చి వరకు వినియోగించిన యూనిట్లకు 13 పైసలు తగ్గించారు. ఉమ్మడి గుంటూరు జిల్లాలోని సీఆర్‌డీఏ, గుంటూరు, పల్నాడు, బాపట్ల సర్కిల్స్ పరిధిలోని డివిజన్‌లలో గణాంకాలు లెక్కించగా రూ.32 కోట్లు వరకు వినియోగదారులకు లబ్ధి జరగనున్నట్లు పేర్కొన్నారు. గత ఏడాది ఏప్రిల్ నుంచి నెలనెలా వినియోగించిన యూనిట్లను లెక్కించనున్నారు. 2024 ఏప్రిల్ నుంచి నెల నెలా లెక్కించి ప్రస్తుత బిల్లుల్లో జమ చేస్తారు. అయితే ఏప్రిల్ 2024 బిల్లులో వినియోగించిన యూనిట్లకు 13 పైసలు చొప్పున కలిపి నవంబరు బిల్లులో జమ చేసి బిల్లులో మైనస్ చేసి బిల్లులు అందజేస్తున్నారు.



ట్రూ డౌన్ పేరుతో బిల్లుల్లో జమ చేసిన మొత్తం

అద్దెకు ఉండే వారికి మరింత మేలు..

ఎఫ్‌పీపీసీఏ చార్జీల బాదుడుతో అద్దెలకు ఉండే వారు తీవ్ర ఇబ్బందులు పడాల్సి వచ్చేది. అయితే ఇది గతంలో పరిస్థితి. ప్రస్తుత ట్రూ డౌన్ ఛార్జీతో ఇప్పుడు అద్దెలకు ఉండే వారికి మేలు జరగనున్నది. గతంలో అద్దెకు ఉన్న వారు విద్యుత్ వినియోగం అత్యధికంగా చేసి ఉంటే అదే ఇంట్లో ప్రస్తుతం అద్దెకు ఉండే వారికి బిల్లులో ఊరట కలగనున్నది.



వస్తువులతో చిన్నారులు

ఆటలతో పాఠాలు

బోధనకు నూతన ఒరవడి ● స్కూళ్లకు చేరిన 62 కిట్లు
● జిల్లాలో 1192 ప్రాథమిక పాఠశాలలకు పంపిణీ

చీరాల, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): ప్రాథమిక స్థాయిలో నూతన ఒరవడితో విద్యా బోధనకు విద్యాశాఖ రంగం సిద్ధం చేసింది. ఆటలతో చిన్నారుల్లో విద్యపై శ్రద్ధ పెరిగేలా చేస్తోంది. పాఠశాలలకు వచ్చేందుకు మొండికేసే చిన్నారులు కూడా బడిపై మక్కువ పెంచుకునేలా బోధనాంశాలు ప్రవేశపెట్టారు. విద్యాశాఖ కార్యక్రమాలతో పాఠశాలల్లో కొంతవరకు పండుగ వాతావరణం ఏర్పడనున్నది. ఈక్రమంలోనే 62 ఆట వస్తువులతో జాదూయి పిఠారా (మాయా పెట్టె) కిట్లను అధికారులు రూపొందించారు. వీటిని జిల్లా వ్యాప్తంగా ఉన్న 1192 ప్రాథమిక పాఠశాలలకు ఆయా పాఠశాలల్లో విద్యార్థుల సామర్థ్యాన్ని బట్టి పంపిణీ చేసింది. అలాగే అంగన్వాడీలో 1, 2 తరగతుల చిన్నారులకు కూడా వీటిని అందజేసింది. వీటితో సృజనాత్మక ఆలోచన శక్తి, అభ్యసన నైపుణ్యాలను పెంపొందించే దిశగా ఇకపై పాఠశాలల్లో అడుగులు పడనున్నాయి. బాక్సుల్లో వివిధ రకాల బొమ్మలు, కథలు, ఫజిల్స్, తోలు బొమ్మలో, అంకెలు, రంగులు, ఫ్లాష్ కార్డులు, పెన్సిళ్లు బోధనోపకరణాలు ఉన్నాయి. వీటిని ఇప్పటికే ఆయా స్కూళ్లకు పంపిణీ చేయడంతో వీటితో ఆడేందుకు చిన్నారులు పోటీ పడుతున్నారు. వీటి ద్వారా బోధన అందించి వివిధ రకాల ప్రాజెక్టులు స్వయంగా తయారుచేసేలా ఉపాధ్యాయులు బోధన అందిస్తున్నారు.

మానసిక ధైర్యం

పిల్లల్లో మానసిక ధైర్యాన్ని నింపేందుకు జాదూయి పిఠారా(మాయాపెట్టె) ప్రయోజనకరంగా ఉంటుంది. ఇప్పటికే జిల్లాలో కిట్లను అన్ని పాఠశాలలకు పంపిణీ జరిగింది. కిట్ల వినియోగం చక్కటి ప్రయోజనాన్ని అందిస్తోంది. చిన్నారులు వీటి ద్వారా ఉత్సాహంగా ఉంటున్నారు.

- బిల్లా మోజెస్, సమగ్ర అకడమిక్ మానిటర్ అధికారి



ఆటలతో బోధన చేస్తున్న ఉపాధ్యాయులు

విజన్ యాక్షన్‌ప్లాన్ కార్యాలయాలు సిద్ధం



విజన్ కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న కలెక్టర్ డాక్టర్ వి.వినోద్‌కుమార్, ఎమ్మెల్యే నరేంద్రవర్మ తదితరులు

బాపట్ల, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): నియోజకవర్గ విజన్ యాక్షన్ ప్లాన్ కార్యాలయాలు సిద్ధమవుతున్నట్లు కలెక్టర్ డాక్టర్ వి.వినోద్‌కుమార్ తెలిపారు. గురువారం బాపట్లలోని మున్సిపల్ కార్యాలయ ఆవరణంలో బాపట్ల నియోజకవర్గ యాక్షన్ ప్లాన్ యూనిట్ కార్యాలయాన్ని ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మతో కలిసి కలెక్టర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ నియోజకవర్గాల అభివృద్ధి అంశాలపై సమీక్షకు ఎమ్మెల్యేలకు ప్రత్యేకంగా కార్యాలయాలను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ప్రజా సమస్యలు, అభివృద్ధి పనులపై సమీక్షకు ఈ కార్యాలయాలు ఎంతోగానో ఉపయోగపడతాయన్నారు. ప్రజలను కలుసుకుని వారితో మాట్లాడుకునేందుకు ఎమ్మెల్యేలకు ఇవి వేదికలుగా ఉంటాయన్నారు. ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ మాట్లాడుతూ కార్యాలయానికి వచ్చే ప్రజలకు అవసరమైన అన్ని సౌకర్యాలు ఏర్పాటు చేస్తామన్నారు. ప్రజలకు ఎమ్మెల్యేలు అందుబాటులో ఉండాలని ముఖ్యమంత్రి యూనిట్ కార్యాలయాన్ని ఏర్పాటుకు చర్యలు తీసుకున్నారన్నారు. ప్రతి మంగళ, బుధ, శుక్రవారాలలో విజన్ కార్యాలయంలో ప్రజలకు అందుబాటులో ఉంటానన్నారు. అనంతరం కార్యాలయ ప్రాంగణంలో కలెక్టర్, ఎమ్మెల్యే మొక్కలు నాటి నీరు పోశారు. ఈ కార్యక్రమంలో బాపుడా చైర్మన్ సలగల రాజశేఖర్‌బాబు, జనసేన సమన్వయకర్త నామన వెంకటశివన్నారాయణ, కార్పొరేషన్ డైరెక్టర్లు మందపాటి ఆంద్రేయ, చాపా సోమయ్య, చివుకుల దుర్గా ప్రసాద్, పార్లమెంట్ మహిళా ప్రధాన కార్యదర్శి పల్లం సరోజని, కమిషనర్ జి.రఘునాథరెడ్డి, డీఈ కృష్ణారెడ్డి, టీడీపీ పట్టణ, మండల అధ్యక్షులు గొలపల శ్రీనివాసరావు, ముక్కామల సాంబశివరావు, కూచిపూడి శ్యామ్‌సుందర్, పట్టణ మాజీ అధ్యక్షులు వెంకటేశ్వరరావు, శీలం శ్రీనివాసరావు, గిరిజారాణి పాల్గొన్నారు.

కొనలేం.. తినలేం

● భగ్గుమంటున్న కూరగాయల ధరలు
● మొంథా తుపానుతో దెబ్బతిన్న తోటలు



బల్లికురవ, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): మొంథా తుపాను దెబ్బకు కూరగాయల ధరలకు రెక్కలు వచ్చాయి. పలు గ్రామాలలో కూరగాయల తోటలు వర్షాలకు దెబ్బతిన్నాయి. దీంతో మార్కెట్‌లో అన్ని రకాల కూరగాయలు ధరలు అమాంతం పెరిగాయి. వాటి ధరలు చూసి వినియోగదారులు బెంబేలెత్తిపోతున్నారు. ధరలు ఈ విధంగా మండిపోతే కొనేదెలా తినేదెలా అని వాపోతున్నారు. వారం రోజుల నుంచి ధరలు భగ్గుమంటున్నాయంటున్నారు. రైతుల వద్ద కూరగాయాలు లేని సమయంలో ధరలు పెరుగుతున్నాయి. మార్కెట్‌లో ప్రస్తుతం బెండకాయలు కేజీ రూ.80, గోరుచిక్కుడు కేజీ రూ.100, వంకాయలు కేజీ రూ.80, దోసకాయలు రూ.50, పెద్ద చిక్కుడు రూ.100, బీరకాయ రూ.110, పొట్లకాయలు రూ.60, టమోటా రూ.50, మిర్చి రూ.50 చొప్పున అమ్మకాలు చేస్తున్నారు. గత నెలలో ధరలు చాలా తక్కువగా ఉండగా తుపాను అనంతరం ఒక్కసారిగా పెరిగిపోయాయి. ఈ ధరలు చూసి పలువురు కూరగాయలు జోలికి పోకుండా పచ్చళ్లను వాడుతున్నారు. రోజువారీ కూలి పనులు చేసుకుంటూ జీవనం సాగించేవారు తమ సంపాదన కూరగాయలకే సరిపోతుందంటున్నారు. రైతు బజార్లు, వ్యవసాయ మార్కెట్ల ద్వారా కూరగాయలను తక్కువ ధరకు అందించేలా అధికారులు చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు. ధరలపై నియంత్రణ చేపట్టి అందరికీ అందుబాటులో ఉండి చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

ముక్తేశ్వరం మేజర్‌కు మోక్షం

మంత్రి చొరవతో నాచు తొలగింపు ● విడుదలైన సాగునీరు..

బల్లికురవ, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): నాచుతో నిండిపోయిన ముక్తేశ్వరం మేజర్‌కు మోక్షం లభించింది. సాగునీటి పారుదల కాక రైతులు తీవ్రంగా ఇబ్బందులు పడుతుండటం తెలిసి మంత్రి గొట్టిపాటి రవికుమార్ ప్రత్యేక శ్రద్ధతో శుభ్రం చేయించారు. ముక్తేశ్వరం మేజర్ కాల్వలో నాచు పేరుకుపోయి ముక్తేశ్వరం, చెన్నుపల్లి, రామాంజనేయపురం గ్రామాలలో వరి పొలాలకు నీరు అందడం లేదు. దీంతో పంటలు నెర్రెలు ఇచ్చి ఎండు ముఖం పట్టాయి. ఈ విషయాన్ని రైతులు మంత్రి దృష్టికి రెండు రోజుల క్రితం తీసుకువెళ్లారు. కాల్వను అభివృద్ధి చేసి సాగునీరు సకాలంలో చేరేలా చర్యలు చేపట్టాలని మంత్రి స్థానిక టీడీపీ నేతలు, అధికారులను ఆదేశించారు. ఈ క్రమంలో రెండు రోజుల నుంచి జరుగుతున్న పనులు గురువారంతో పూర్తి అయ్యాయి. వెంటనే సాగుకు నీటిని అధికారులు విడుదల చేశారు. మేజరులో సాగునీరు సాఫీగా పారుదలతో రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.



మేజర్ కాలువలో నాచును తొలగిస్తున్న ఎక్స్‌కవేటర్



ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో ప్రారంభించనున్న డైనింగ్‌హాల్

ప్రారంభోత్సవాలకు అభివృద్ధి పనులు సిద్ధం

● అద్దంకిలో 17న మంత్రులు నారాయణ,రవికుమార్ పర్యటన

అద్దంకి, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): అద్దంకి పట్టణంలో రూ.కోట్లతో నిర్మించిన పలు అభివృద్ధి పనులు ప్రారంభోత్సవాలకు సిద్ధమయ్యాయి. ఈ క్రమంలో ఈ నెల 17న అద్దంకిలో పర్యటించనున్న మంత్రులు నారాయణ, గొట్టిపాటి రవికుమార్ ఆయా పనులను ప్రారంభించనున్నారు. రూ.3 కోట్ల బీపీఎస్ నిధులతో సీసీ రోడ్లు, డ్రెయిన్లు నిర్మించారు. ఎస్సీ, ఎస్టీ సబ్ ప్లాన్ నిధులు రూ.3 కోట్లతో, ఒంగోలు అర్బన్ డెవలప్‌మెంట్ నిధులు రూ.1.25 కోట్లతో పలు అభివృద్ధి పనులు జరిగాయి. ద్వారకానగర్ వద్ద రూ.4.5 కోట్లతో 33 కేవీ సబ్‌స్టేషన్, పసుమర్తిపాలెంలో కమ్యూనిటీహాల్, ప్రభుత్వ జూనియర్ కళాశాలలో డైనింగ్ హాల్ నిర్మాణం పూర్తి అయింది. వీటిని మంత్రులచే ప్రారంభించేందుకు అవసరమైన ఏర్పాట్లను అధికారులు చేస్తున్నారు. అదే రోజున ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థులకు సైకిళ్ళు పంపిణీ చేయనున్నారు. అద్దంకి మేజర్ కాల్వ పరిధిలోని సుమారు 60 కుటుంబాలకు శింగరకొండ సమీపంలోని అద్దంకి కొండ వద్ద స్థలాలు కేటాయించగా వారికి పట్టాలను అందజేయనున్నారు.

ద్విచక్ర వాహనాన్ని ఢీకొన్న కారు..యువకుడి మృతి


విజయ్‌కుమార్‌రెడ్డి (ఫైల్‌ఫోటో)

దాచేపల్లి, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): అదుపుతప్పి అతివేగంగా ప్రయాణిస్తున్న కారు.. ఢీకొనడంతో ద్విచక్ర వాహనదారుడు అక్కడికక్కడే మృతి చెందగా.. వెనుక కూర్చున్న మరో యువకుడికి కాలు విరిగిన ఘటన బుధవారం రాత్రి నడికుడి మలుపు వద్ద జరిగింది. పోలీసులు, బంధువుల వివరాల మేరకు.. గుంటూరు నుంచి సిద్ధిపేటకు మితిమీరిన వేగంతో వస్తున్న కారు ద్విచక్ర వాహనంపై వెళ్తున్న తాడిపర్తి విజయ్‌కుమార్‌రెడ్డి (28)ని వేగంగా ఢీకొట్టింది. దీంతో విజయ్‌కుమార్‌రెడ్డి తలకు తీవ్ర గాయమై అక్కడికక్కడే మృతిచెందాడు. బండిపై ఉన్న మరో యువకుడు కుడి కాలు విరిగి తీవ్ర రక్తస్రావమైంది. ఈ ఘటనపై స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. క్షతగాత్రుడిని ఆసుపత్రికి తరలించారు. విజయ్‌కుమార్‌రెడ్డి మృతదేహాన్ని గురజాల ప్రభుత్వ వైద్యశాలకు తరలించి పోస్టుమార్టం నిర్వహించారు. మృతుడి తండ్రి శ్రీనివాసరెడ్డి దాచేపల్లిలో ఎరువుల కంపెనీలో ఉద్యోగిగా పనిచేస్తున్నాడు. కుమారుడికి వివాహ ప్రయత్నాలు చేస్తుండగా.. ఈలోగా ఈ ఘటన జరగడంతో కుటుంబం తల్లడిల్లిపోతోంది. సీఐ భాస్కరరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి

దుగ్గిరాల, నవంబరు 13(ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన యువకుడు చికిత్స పొందుతూ గురువారం మృతిచెందాడు. చింతలపూడి వద్ద ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో నలుగురు గాయపడి ఆసుపత్రి పాలైన విషయం విధితమే. గాయపడిన వారిలో అంగలకుదురుకు చెందిన దుడ్డి ప్రశాంత్(31)ని 108 వాహనంలో తెనాలి ప్రభుత్వ వైద్యశాలకు తరలించగా.. పరిస్థితి విషమంగా ఉందని చెప్పారు. అనంతరం ప్రశాంత్‌ను గుంటూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించగా.. చికిత్సపొందుతూ మృతిచెందినట్లు ఎస్సై ఎస్. వెంకటరవి తెలిపారు.

ఏఎన్‌యూ దూరవిద్య

పీజీ పరీక్ష ఫలితాలు విడుదల


పరీక్ష ఫలితాలు విడుదల చేస్తున్న సీడీఈ డైరెక్టర్ వి.వెంకటేశ్వర్లు

ఏఎన్‌యూ, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): ఆచార్య నాగార్జున విశ్వ విద్యాలయం దూరవిద్య కేంద్రం పరిధిలో జూలై, ఆగస్టులో జరిగిన పలు పీజీ కోర్సుల పరీక్ష ఫలితాలను దూరవిద్య కేంద్రం డైరెక్టర్ ఆచార్య వంకాయల పాటి వెంకటేశ్వర్లు, పరీక్షల విభాగ కోఆర్డినేటర్ ఆచార్య డి. రామచంద్రన్ గురువారం విడుదల చేశారు. ఎంఏ సంస్కృతం, పొలిటికల్ సైన్స్ మొదటి, ద్వితీయ, తృతీయ, నాల్గవ సెమిస్టర్, ఎమ్మెస్సీ జువాలజీ, బోటనీ, మైక్రో బయాలజీ మొదటి సెమిస్టర్ పరీక్ష ఫలితాలను విడుదల చేశారు. రీవాల్యుయేషన్‌కు దరఖాస్తులు ఈ నెల 29 తేదీలోగా అందజేయాలని సూచించారు. పరీక్షల విభాగ డిప్యూటీ రిజిస్ట్రార్ జైనలుద్దీన్, అసిస్టెంట్ రిజిస్ట్రార్లు కృష్ణవేణి, కోదండపాణి, టంకశాల వెంకటేశ్వర్లు, ఉద్యోగి వలి పాల్గొన్నారు.

సమర్థంగా విజన్ యాక్షన్ ప్లాన్ యూనిట్‌లు

● కలెక్టర్ డాక్టర్ వి.వినోద్‌కుమార్


సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ డాక్టర్ వి.వినోద్‌కుమార్

బాపట్ల, నవంబరు 13(ఆంధ్రజ్యోతి): నియోజకవర్గాల అభివృద్ధి కోసం విజన్ యాక్షన్ ప్లాన్ యూనిట్‌లను ఏర్పాటు చేసి సమర్థంగా పనిచేయాలని కలెక్టర్ డాక్టర్ వి.వినోద్‌కుమార్ తెలిపారు. జిల్లాలోని 6 నియోజకవర్గాలకు సంబంధించిన విజన్ యాక్షన్ ప్లాన్ యూనిట్‌ల సిబ్బందితో గురువారం ఆయన సమావేశం నిర్వహించారు. బాపట్ల మున్సిపల్ కార్యాలయ ప్రాంగణంలో విజన్ యాక్షన్ ప్లాన్ బాపట్ల నియోజకవర్గ యూనిట్ ప్రారంభించడం జరిగిందన్నారు. కార్యాలయ ప్రాంగణం మొక్కలతో సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దారన్నారు. నియోజకవర్గ ప్రత్యేకాధికారికి, ఎమ్మెల్యేకు ప్రత్యేక క్యాబిన్‌లు ఏర్పాటు చేశారని.. ఈ విధంగా ప్రతి నియోజకవర్గంలో ఏర్పాటు చేయాలని సూచించారు. అద్దంకి నియోజకవర్గంలో ఎంపీడీఓ కార్యాలయం 2వ అంతస్తులో, పర్చూరు నియోజకవర్గంలో కొల్లావారిపాలెం పంచాయతీ కార్యాలయంలో, చీరాల నియోజకవర్గంలో ఎంపీడీఓ కార్యాలయం, రేపల్లె నియోజకవర్గంలో ఎన్టీఆర్ ప్రాథమిక పాఠశాల మొదటి అంతస్తులో, వేమూరు నియోజకవర్గంలో ఎంపీడీఓ కార్యాలయం నందు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ప్రతి నియోజకవర్గంలో యాక్షన్‌ప్లాన్ యూనిట్ నిర్వాహణకు రూ.10లక్షలు మంజూరు చేసినట్లు తెలిపారు. అందులో రూ.8 లక్షలు కార్యాలయ ఫర్నీచర్, ఉపకరణాలకు..రూ. 2లక్షలు కార్యాలయ పెయింటింగ్, మరమ్మతులకు కేటాయించినట్లు తెలిపారు. ప్రతి కార్యాలయానికి ఫర్నీచర్, ఉపకరణాలు సరఫరా చేశారన్నారు. పెయింటింగ్, మరమ్మతులు పది రోజుల్లో పూర్తిచేయాలని ఆదేశించారు. సిబ్బంది పూర్తి బాధ్యత నియోజకవర్గ ప్రత్యేకాధికారిపై ఉందని కలెక్టర్ స్పష్టం చేశారు. విజన్ యాక్షన్ ప్లాన్ యూనిట్‌లను తనిఖీ చేస్తామన్నారు. ఈ సమయంలో అందరు ఐడీ కార్డు ధరించి ఉండాలని, కార్యాలయ పరిసరాలు పరిశుభ్రంగా ఉంచాలని తెలిపారు. అనంతరం కలెక్టరేట్‌లోని జిల్లా స్థాయి విజన్ యాక్షన్ ప్లాన్ యూనిట్‌ను కలెక్టర్ తనిఖీ చేశారు. ఫర్నీచర్, ఉపకరణాలను పరిశీలించి సిబ్బంది సమస్యలను తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో ముఖ్య ప్రణాళికాధికారి షాలెం రాజు, విద్యుత్ ఎస్ఈ ఆంజనేయులు, మున్సిపల్ డీఈ కృష్ణారెడ్డి, విద్యుత్ ఈఈలు, డీఈలు, ఏఈలు, సిబ్బంది పాల్గొన్నారు.

పెండింగ్ పనులు వెంటనే పూర్తి చేయండి

● అధికారులకు జడ్పీ చెర్‌పర్సన్ ఆదేశం


మాట్లాతున్న జడ్పీ చైర్‌పర్సన్ కత్తెర హెనీ క్రిస్టినా

గుంటూరు సిటీ, నవంబరు 13(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి గుంటూరు జిల్లాలో పెండింగ్ పనులను వెంటనే పూర్తి చేయాలని జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ కత్తెర హెనీ క్రిస్టినా ఆదేశించారు. స్థానిక గుంటూరు జిల్లా పరిషత్ కార్యాలయంలో గురువారం 15 ఆర్థిక సంఘం, సాధారణ నిధులపై జరిగిన సమీక్ష సమావేశంలో చైర్‌పర్సన్ మాట్లాడుతూ.. గుంటూరు, బాపట్ల, పల్నాడు జిల్లాల్లో ఆయా నిధులు కింద చేపట్టిన పనులు ఏ దశలో ఉన్నాయో అధికారులను అడిగి తెలుసుకున్నారు. కొన్ని పనులు పూర్తి కాగా మరికొన్ని మధ్య దశలో ఉన్నాయని, ప్రారంభించాల్సిన పనులు కూడా మిగిలి ఉన్నాయని అధికారులు తెలిపారు. వాటి వివరాలను తనకు తెలియజేయాలని చైర్‌పర్సన్ కోరారు. 2025 -26 సంవత్సరానికి పనుల అంచనాలు తయారు చేసి, 2026- 27 బడ్జెట్ కూడా తయారు చేయాలని ఆమె అధికారులను కోరారు. అదేవిధంగా శిలాఫలకాల విషయంలో ప్రొటో కాల్‌ను తప్పనిసరిగా పాటించాలని సూచించారు. ఈ సమావేశంలో డిప్యూటీ సీఈఓ చొప్పర కృష్ణ ఏఓలు, మూడు జిల్లాల పంచాయతీరాజ్ ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్సీలు, ఈఈ, డీఈలు పాల్గొన్నారు.

మహిళలు పురుషులకంటే తక్కువ కాదు

● నావికాదళ లెఫ్టినెంట్ కమాండర్ ఐశ్వర్య


వర్చువల్‌గా విద్యార్థులతో మాట్లాడుతున్న బొడ్డపాటి ఐశ్వర్య

బాపట్ల, నవంబరు 13(ఆంధ్రజ్యోతి) : ఏ రంగంలోనైన మహిళలు పురుషుల కంటే తక్కువ కాదని.. లక్ష్య సాధనలో మార్గనిర్దేశం చేసే ఉన్నత వ్యక్తుల సూచనలను పరిగణంలోకి తీసుకొని అడుగు ముందుకు వేయాలని భారత నావికదళ లెఫ్టినెంట్ కమాండర్ బొడ్డపాటి ఐశ్వర్య అన్నారు. బాపట్ల వ్యవసాయ కళాశాలలో దీక్షారంభం మూడోవరోజు కార్యక్రమంలో జూమ్ సమావేశం ద్వారా అతిథిగా పాల్గొన్న ఆమె నూతన విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడారు. తనకు పెద్దలు, సహచరులిచ్చిన ప్రోత్సాహంతో ఐ.ఎన్.ఎస్.వి తరణిలో ప్రపంచాన్ని చుట్టి వచ్చిన మొదటి మహిళా సిబ్బందిలో ఒకరుగా గుర్తింపు పొందానని తెలిపారు. జీవితం సవాల్‌తో నిండి ఉంటుందని.. ఈ వాస్తవాన్ని గుర్తించిన విద్యార్థులు తమకు దక్కిన సౌకర్యవంతమైన పరిధి నుంచి బయటకొచ్చి పోరాడాలని పిలుపునిచ్చారు. బిడ్డల కలలను సాకారం చేసుకునేందుకు తల్లిదండ్రులు సంపూర్ణంగా సహకరించాలన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ పి.ప్రసూనరాణి, డాక్టర్ శ్రీరేఖ, బోధన, బోధనేతర సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

అక్రమ లేఅవుట్లపై సీఆర్డీఏ కొరడా


అమరావతి మండలంలో అనధికార లేఅవుట్‌ను చదును చేయిస్తున్న సీఆర్డీఏ అధికారులు

తుళ్లూరు, నవంబరు 13(ఆంధ్రజ్యోతి): అక్రమ లేఅవుట్లపై సీఆర్డీఏ కొరడా ఝులిపించింది. గత వైసీపీ ప్రభుత్వంలో నిబంధనలకు విరుద్ధంగా సీఆర్డీఏ పరిధిలో ఎలాంటి అనుమతులు తీసుకోకుండా వెంచర్లను ఏర్పాటు చేశారు. అందులో ప్లాట్లు కొన్నవాళ్లు ఇప్పుడు లబోదిబోమంటున్నారు. వారం నుంచి సీఆర్డీఏ కృష్ణా, గుంటూరు జిల్లాల్లో ఈ అక్రమ లేఅవుట్‌లను గుర్తించి ధ్వంసం చేస్తోంది. గురువారం కృష్ణాజిల్లా నందిగామ జోన్ పరిధిలోని జగ్గయ్యపేట మండలం చిల్లకల్లు గ్రామ సర్వే నంబరు 120బై 1ఏ2(పీ)లో 5.00 ఎకరాల లేఅవుట్‌ను సీఆర్డీఏ అధికారులు పొక్లెయిన్‌తో తొలగించారు. అలాగే ఉంగుటూరు మండలంలోని సర్వే నంబరు 141(పీ)లోని 1.50 ఎకరాలు, గుంటూరు జిల్లా అమరావతి మండలంలోని డోర్ నంబరు 78బైఏ2బి, బి2సీలోని అనధికార లేఅవుట్లను ధ్వంసం చేయించారు. అనధికార లేఅవుట్లను ఎట్టి పరిస్థితుల్లోనూ ఉపేక్షించబోమని రాయపూడి రెవెన్యూలోని సీఆర్డీఏ ప్రధాన కార్యాలయం గురువారం ఓ ప్రకటనలో హెచ్చరించింది.



'బర్లీ' బకాయిలు.. రూ.38 కోట్లు

(5వ పేజీ తరువాయి)

ఖాతాల్లో జమ చేశామని మార్క్‌ఫెడ్ అధికారులు చెప్తున్నారు. అయితే క్షేత్రస్థాయిలో పలు గ్రామాల్లోని రైతులు మాత్రం ఇంకా తమ ఖాతాల్లో డబ్బులు జమ కాలేదని చెప్తున్నారు. బర్లీ పొగాకు కొనుగోళ్లు ప్రారంభమైన మొదటి వారంలోనే తమ ఉత్పత్తులను అమ్ముకున్న రైతులకు సైతం ఇంకా డబ్బులు జమ కాలేదని తెలుస్తోంది. దాదాపు నాలుగు నెలలుగా బకాయిలు జమ కోసం రైతులు ఎదురుచూస్తున్నారు. బర్లీ బకాయిల డబ్బుల వ్యథ ఇలా ఉంటే మొంథా తుఫాన్ రూపంలో నిల్వ ఉంచిన బేళ్లను మరింత దెబ్బతీసింది. మొంథా మిగిల్చిన నష్టాలకు సంబంధించి అన్ని పంటల గణన జరిగినప్పటికీ సాంకేతిక అంశాలతో ఆ జాబితాలో బర్లీ పొగాకు పేరు లేదు. దీంతో సాగుదారులు నీరుగారిపోయారు. ఇదే విషయాన్ని రైతులు తాజాగా కారంచేడులో పర్యటించిన కేంద్ర బృందం దృష్టికి కూడా తీసుకెళ్లారు.

రైతుల వద్ద ఇంకా 50 వేల క్వింటాళ్లు

క్షేత్రస్థాయిలో నాలుగు జిల్లాల పరిధిలోని రైతుల వద్ద ఇంకా 50,000 క్వింటాళ్ల బర్లీ నిల్వలు ఉంటాయనేది అంచనా. కాగా మంత్రులు, ఎమ్మెల్యేలను కూడా రైతులు కలిసి పొగాకు కొనుగోళ్లపై అభ్యర్థించారు. ఈ క్రమంలో 20,000 క్వింటాళ్ల అదనపు బర్లీ కొనుగోళ్లపై జిల్లా అధికారులు మార్క్‌ఫెడ్‌కు పంపిన ప్రతిపాదనలపై ఇప్పటికీ కదలికలేదు. రోజులు గడుస్తున్నాయే కానీ అదనపు కొనుగోళ్లపై మార్క్‌ఫెడ్ నుంచి స్పందన లేకపోవడంతో ఆశలు వదులుకోవడమే మేలనే అభిప్రాయానికి దాదాపు రైతులు వచ్చారు. ఇందులో దాదాపు 10,000 క్వింటాళ్ల వరకు మొంథా తుఫాన్ దెబ్బకి పూర్తిగా నాణ్యత దెబ్బతిని లోగ్రేడ్ రకంలో చేరిపోయింది. అటు అదనపు కొనుగోళ్ల లేక, ఇటు మొంథా నష్ట పరిహార జాబితాలో తమకు చోటు దక్కక, బకాయిలకు నెలల తరబడి ఎదరుచూడాల్సిన పరిస్థితి బర్లీ రైతాంగానిది.



నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

● విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.6.00 ● నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్ (కిలో)	122, 132, 142
చికెన్ విత్ స్కిన్(కిలో)	230.00
చికెన్ స్కిన్ లెస్(కిలో)	240.00

వర్కింగ్ జర్నలిస్టుల..

అక్రిడిటేషన్‌కు దరఖాస్తుల ఆహ్వానం

● సమాచార, పౌర సంబంధాల శాఖ డైరెక్టర్ విశ్వనాథన్

గుంటూరు, నవంబరు 13(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర, జిల్లా స్థాయిలో పనిచేస్తున్న పాత్రికేయులకు రెండేళ్ల (2026 - 2027) కాలపరిమితికి సమాచార, పౌర సంబంధాల శాఖ జారీ చేసే నూతన అక్రిడిటేషన్‌లకు దరఖాస్తులను స్వీకరిస్తున్నట్లు డైరెక్టర్ కేఎస్ విశ్వనాథన్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. నిబంధనల మేరకు అర్హత కలిగిన పాత్రికేయుల దరఖాస్తులు ఆన్‌లైన్ ద్వారా స్వీకరిస్తారని తెలిపారు. గతంలో జారీ చేసిన అక్రిడిటేషన్ కార్డుల గడువు ఈ నెల 30 నాటికి ముగుస్తున్నందున నూతన అక్రిడిటేషన్స్ జారీ ప్రక్రియ చేపట్టడం జరిగిందన్నారు. దరఖాస్తుల నమోదుకు ముందుగా మీడియా సంస్థల వివరాలు పోర్టల్‌లో పొందుపరచాల్సి ఉన్నందున సంబంధిత పత్రాలను పెన్‌డ్రైవ్‌లో పొందు పరిచి, కాపీలను గుంటూరు బ్రాడీపేటలోని డీపీఆర్వో కార్యాలయంలో అందజేయాలని తెలిపారు. అనంతరం పాత్రికేయులు నవంబర్ 14వ తేదీ నుంచి mediarelations.ap.gov.in వెబ్‌సైట్‌లో సూచించిన విధంగా సంబంధిత పూర్తి వివరాలను నమోదు చేయాల్సి ఉంటుందని డైరెక్టర్ పేర్కొన్నారు.

సికింద్రాబాద్ - కాకినాడ టౌన్ ప్రత్యేక రైలు

గుంటూరు, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): ప్రయాణికుల రద్దీ దృష్ట్యా గుంటూరు మీదగా సికింద్రాబాద్ - కాకినాడ టౌన్ స్పెషల్ ట్రైన్‌ని నడపనున్నట్లు దక్షిణ మధ్య రైల్వే సీపీఆర్వో ఎ.శ్రీధర్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. 07619 సికింద్రాబాద్ - కాకినాడ టౌన్ ప్రత్యేక రైలు ఈ నెల 16న రాత్రి 7.40కి బయలుదేరి 10.28కి నడికుడి, 10.58కి పిడుగురాళ్ల, 11.38కి సత్తెనపల్లి, అర్ధరాత్రి దాటాక 12.35కి గుంటూరు, 17వ తేదీ ఉదయం 9.30కి కాకినాడ టౌన్‌కు చేరుకొంటుందన్నారు.

రంగు మారిన పత్తిని తీసుకురావొద్దు

● మార్కెటింగ్ ఏడీ సత్యనారాయణ చౌదరి

గుంటూరు, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): గుడ్డి, కౌడి, రంగుమారిన పత్తిని జిల్లాలోని పత్తి కొనుగోలు కేంద్రాలకు రైతులు తీసుకురావొద్దని వ్యవసాయ, వాణిజ్య మార్కెటింగ్ అధికారి సత్యనారాయణ చౌదరి విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు. జిల్లాలోని ఏఎంసీల పరిధిలో కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా నోటిఫైడ్ జిన్నింగ్ మిల్లుల్లో పత్తి కొనుగోళ్లను ప్రారంభించామన్నారు. పత్తి రైతులందరూ తమ పేర్లను వారికి సమీపంలోని రైతు సేవా కేంద్రాలలో నమోదు చేసుకొని కపాస్ కిసాన్ యాప్‌లో స్లాట్ బుకింగ్ చేయించుకోవాలని సూచించారు. స్లాట్ బుకింగ్ జరిగిన తేదీన పత్తిని ప్లాస్టిక్ సంచులలో కాకుండా లూజు రూపంలో ఆరబెట్టుకొని నాణ్యత ప్రమాణాలకు అనుగుణంగా 12 శాతం లోపు తేమ ఉన్న పత్తిని కొనుగోలు కేంద్రాలకు తీసుకురావాలన్నారు. క్వింటాల్‌కు కేంద్ర ప్రభుత్వం రూ.8,110 ధర నిర్ణయించిందన్నారు. రైతులు ఎవరూ మధ్యవర్తులు/దళారుల వద్దకు వెళ్లకుండా నోటిఫైడ్ జిన్నింగ్ మిల్లులకు తీసుకొచ్చి విక్రయించి.. కనీస మద్దతు ధరని పొందాలని విజ్ఞప్తి చేశారు.

ఇసుక ట్రాక్టర్లు అడ్డగింత..వాగ్వాదం


కొల్లూరు కరకట్టపై ట్రాక్టర్లను అడ్డుకుంటున్న రెవెన్యూ, పోలీసు సిబ్బంది

కొల్లూరు, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): పెసర్లంక అరవింద వారధి నుంచి ఇసుక లోడుతో వస్తున్న 50 ట్రాక్టర్లను కొల్లూరు కరకట్ట వద్ద రెవెన్యూ, పోలీసు సిబ్బంది గురువారం అడ్డుకున్నారు. దీంతో ట్రాక్టర్ల యజమానులకు, సిబ్బందికి మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది. ఇసుక తవ్వకాలకు అనుమతి లేదంటూనే.. తమను అడ్డుకుని.. రెండు ట్రాక్టర్లను ఎందుకు పంపించారని ట్రాక్టర్ల యజమానులు నిలదీశారు. అయితే ఆ రెండు ట్రాక్టర్ల ఇసుక ప్రభుత్వ అబివృద్ధి పనుల కోసమని.. వివరించినప్పటికి ట్రాక్టర్ల యజమానులు వినిపించుకోలేదు. దీంతో విషయాన్ని ఫోన్ ద్వారా సీఐ ఆంజనేయులకు తెలుపగా.. ఆయన ట్రాక్టర్ల నిర్వాహకులతో మాట్లాడారు. తాను క్రైమ్ మీటింగ్‌లో ఉన్నానని.. సాయంత్రం మాట్లాడదామని అప్పటి వరకు తొందరపడొద్దంటూ సర్ది చెప్పారు. దీంతో నిర్వాహకులు ట్రాక్టర్లతో వెనుదిరిగారు.

47,533 మిర్చి టిక్కీల అమ్మకం

గుంటూరు, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): మిర్చియార్డుకు గురువారం 48,406 మిర్చి టిక్కీలు విక్రయానికి రాగా ముందురోజు నిల్వ ఉన్న వాటితో కలిపి 47,533 అమ్మకం జరిగినట్లు గుంటూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ ఉన్నతశ్రేణి కార్యదర్శి ఏ చంద్రిక తెలిపారు. ఇంకా యార్డు ఆవరణలో 13,564 మిర్చి టిక్కీలు నిల్వ ఉన్నట్లు పేర్కొన్నారు. వివిధ రకాల మిరపకాయలకు ధరలు ఈ కింది విధంగా నమోదయ్యాయి.

వెరైటీ	కనిష్ఠధర	గరిష్ఠధర	వెరైటీ	కనిష్ఠధర	గరిష్ఠధర
నాన్ ఏసీ కామన్ వెరైటీ			ఆర్మూరు	10000	13500
334	10000	17500	ఏసీ కామన్ వెరైటీ		
నెంబరు. 5	10000	15000	334	10500	17000
273	10500	14200	నెంబరు. 5	---	---
341	10000	17000	273	----	----
4884	----	----	341	10000	17400
సూపర్ 10	----	----	4884	11000	14500
నాన్ ఏసీ స్పెషల్ వెరైటీ			ఏసీ స్పెషల్ వెరైటీ		
తేజ	10000	16000	తేజ	10000	15500
షార్క్-1	-----	----	బ్యాడిగి	10000	17500
బ్యాడిగి	10500	17000	దేవనూరు డీలక్స్	10500	16300
దేవనూరు డీలక్స్	10500	16400	తాలుకాయలు	5000	8800



మూడుచక్రాల వాహనాలకు దరఖాస్తు చేసుకోండి

బాపట్ల, నవంబరు 13(ఆంధ్రజ్యోతి) : మూడుచక్రాల వాహనాల కోసం ఈ నెల 25వ తేదీలోపు దరఖాస్తు చేసుకోవాలని విభిన్న ప్రతిభావంతుల, హిజ్రాల, వయోవృద్ధుల సంక్షేమశాఖ సహాయ సంచాలకులు సీహెచ్ సువార్త తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం దివ్యాంగులకు ప్రోత్సాహం కలిగించేందుకు ఈ వాహనాలను మంజూరు చేయనున్నట్లు తెలిపారు. కావున అర్హులైన దివ్యాంగులు దరఖాస్తు చేసుకోవాలన్నారు.

శ్రీఉమామహేశ్వర స్వామికి ఇత్తడి కవచం బహూకరణ



శ్రీ ఉమామహేశ్వర స్వామికి అలంకరించిన ఇత్తడి కవచం

బాపట్ల, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని చీలురోడ్డు సెంటర్లో ఉన్న ఉమామహేశ్వరస్వామికి రొంపిచర్ల కేశవాచార్యులు, సుప్రియ దంపతులు ఇత్తడి కవచాన్ని గురువారం సమర్పించారు. వారి చేతుల మీదుగా అభిషేకం నిర్వహించి స్వామికి అలంకరించారు. భక్తులు పాల్గొన్నారు.

మున్సిపల్ మేనేజర్ లక్ష్మయ్యకు పదోన్నతి

బాపట్ల, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి) : మున్సిపల్ మేనేజర్ పి.లక్ష్మయ్యకు పదోన్నతి లభించింది. ఏలూరు మున్సిపల్ కార్పొరేషన్ సెక్రటరీగా పదోన్నతిపై వెళుతున్న ఆయనను గురువారం సాయంత్రం మున్సిపల్ కార్యాలయంలో ఘనంగా సత్కరించారు. పురపాలక సంఘంలో పనిచేసిన కాలంలో ఆయన చేసిన సేవలను కమిషనర్ జి.రఘునాథరెడ్డి కొనియాడారు. నిబద్ధత గల అధికారులు మున్సిపల్ పరిపాలనకు ఆదర్శమన్నారు. ఆయన కొత్త బాధ్యతలో మరింత విజయాలు సాధించాలని కోరారు. అనంతరం లక్ష్మయ్యను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో ఆర్వో అబ్దుల్ జబ్బార్, టీపీవో మల్లికార్జునరావు, సిబ్బంది పాల్గొన్నారు.

ఛలో ఢిల్లీ కార్యక్రమానికి తరలిరండి

• ఎమ్మెస్పీ జిల్లా అధ్యక్షుడు

బాపట్ల, నవంబరు 13(ఆంధ్రజ్యోతి) : ఎమ్మార్పీఎస్, ఎమ్మెస్పీ ఆధ్వర్యంలో ఈనెల 17వ తేదీన నిర్వహించ తలపెట్టిన చలో ఢిల్లీ కార్యక్రమానికి తరలిరావాలని ఎమ్మెస్పీ జిల్లా అధ్యక్షుడు బి.లక్ష్మీనరసయ్య పిలుపునిచ్చారు. మందా కృష్ణమాదిగ ఆదేశాల మేరకు సుప్రీంకోర్టు చీఫ్ జస్టిస్ బీఆర్ గవాయ్ మీద జరిగిన అమానుషదాడి నెలరోజులు కావస్తున్న నేటి వరకు చట్టపరమైన చర్యలు తీసుకోకపోవటం దారుణమన్నారు. చలో ఢిల్లీ దళితుల ఆత్మగౌరవ ప్రదర్శన విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు దొడ్డ వందనం, తాళ్ళూరి రాజేష్, తగరపు రవి, వేణు, మణికుమార్ తదితరులు ఉన్నారు.

ప్రైవేట్ బస్సుల్లో విస్తృత తనిఖీలు



ప్రైవేట్ బస్సును తనిఖీ చేస్తున్న మోటారు వాహనాల తనిఖీ అధికారి రంగారావు

బాపట్ల, నవంబరు 13(ఆంధ్రజ్యోతి): ప్రయాణికుల భద్రతను దృష్టిలో పెట్టుకొని బాపట్ల మోటారు వాహనాల తనిఖీ అధికారి రంగారావు సిబ్బందితో కలిసి ప్రైవేట్ బస్సుల్లో విస్తృత తనిఖీలు చేపట్టారు. హైదరాబాద్, బెంగళూరు తదితర పట్టణాలకు వెళ్లే బస్సులను తనిఖీ చేసి ఎమర్జన్సీడోర్ పనిచేసే విధానాన్ని పరిశీలించారు. ప్రమాదం సంభవించినప్పుడు బస్సులోపల అలారం మోగే ఏర్పాటును తనిఖీ చేశారు. అగ్నిప్రమాదం జరిగినప్పుడు ఆర్పే విధానం గురించి సూచించారు. డ్రైవర్లు అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

మహిళా ఇంజనీరింగ్ కళాశాలలో వనభోజనాలు

బాపట్ల, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి) : కార్తీకమాసంలో వనభోజనాలు ఎంతో ప్రత్యేకమైనవని బాపట్ల ఎడ్యుకేషన్ సొసైటీ అధ్యక్షుడు ముప్పలనేని శ్రీనివాసరావు పేర్కొన్నారు. కళాశాలలో గురువారం కార్తీక వనసమారాధన కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించి సామూహిక వనభోజనాలు చేశారు. ఈ కార్యక్రమంలో ఎడ్యుకేషన్ సొసైటీ కార్యదర్శి మానం నాగేశ్వరరావు, హరిప్రసాద్, ప్రిన్సిపాల్ జి.శ్రీనివాసరావు, వైస్ ప్రిన్సిపాల్ ఐ.హరిత బోధన, బోధనేతర సిబ్బంది పాల్గొన్నారు.

కావూరులో 8లక్షల దొంగతనం

చెరుకుపల్లి, నవంబరు 13(ఆంధ్రజ్యోతి): మండలంలోని కావూరులో బుధవారం రాత్రి భారీ దొంగతనం జరిగింది. కావూరులో 82 సంవత్సరాల ఆవుల విమలమ్మ అనే మహిళ ఒంటరిగా నివసిస్తోంది. ఇది గమనించిన దొంగలు బుధవారం వెనుక తలుపు నుంచి ఇద్దరు వ్యక్తులు ఆ మహిళ ఇంట్లో చొరబడి ఆమెను బెదిరించి ఆమె దగ్గర ఉన్న నాలుగు వేల రూపాయల నగదు, 8లక్షల రూపాయల విలువైన (ఏడు సవర్ల) బంగారపు గొలుసు దొంగిలించారు. ఈ ఘటనపై చెరుకుపల్లి ఎస్ఐ టి.అనిల్‌కుమార్ క్లూస్ టీంతో ఘటనా స్థలాన్ని పరిశీలించారు. ఈ ఘటనపై దర్యాప్తు జరుపుతున్నామని వీలైనంత త్వరగా ఈ చోరీని ఛేదిస్తామన్నారు.

వల్లభాయ్‌పటేల్ స్ఫూర్తితో యువత ముందుకు వెళ్లాలి

• కలెక్టర్ డాక్టర్ వి.వినోద్‌కుమార్

• బాపట్లలో ఘనంగా ఐక్యతా ర్యాలీ



బాపట్ల అంబేద్కర్ సర్కిల్‌లో ప్రతిజ్ఞ చేస్తున్న కలెక్టర్ డాక్టర్ వి.వినోద్‌కుమార్, అధికారులు

బాపట్ల, నవంబరు 13(ఆంధ్రజ్యోతి) : సర్దార్ వల్లభాయ్‌పటేల్ స్ఫూర్తితో నేటి యువతరం ముందుకు వెళ్లాలని కలెక్టర్ డాక్టర్ వి.వినోద్‌కుమార్ తెలిపారు. పటేల్ 150వ జయంతి ఉత్సవాల్లో భాగంగా గురువారం మున్సిపల్ హైస్కూల్ నుంచి అంబేద్కర్ సర్కిల్ వరకు ఐక్యతా ర్యాలీని నిర్వహించారు. కలెక్టర్ జెండా ఊపి ర్యాలీని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పటేల్ స్ఫూర్తితో అభివృద్ధిలో భాగస్వామ్యం కావాలని పిలుపునిచ్చారు. సర్దార్ వల్లభాయ్ పటేల్ భారతదేశపు ఉక్కుమనిషిగా ప్రసిద్ధి చెందారన్నారు. ఆయన భారతదేశ స్వాతంత్ర్య పోరాటంలో ఒక ముఖ్యమైన వ్యక్తి, భారత జాతీయ కాంగ్రెస్ సీనియర్‌నాయకుడన్నారు. స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత మొదటి హోంమంత్రిగా, ఉపప్రధానిగా పనిచేశారన్నారు. అనంతరం అందరితో నాదేశ ఐక్యత, సమగ్రత, భద్రతను కాపాడటానికి అంకితమవుతామని ప్రతిజ్ఞ చేయించారు. ర్యాలీలో ఎమ్మెల్సీ పోతుల సునీత, ఉపసంచాలకులు కిరణ్మయి, డీఈవో ఎస్.పురుషోత్తం, డీఎస్‌డీవో శ్రీనివాసరావు, మున్సిపల్ కమిషనర్ జి.రఘునాథరెడ్డి, బీజేపీ జిల్లా అధ్యక్షుడు కొండమూది బంగారుబాబు, జనసేన సమన్వయకర్త నామన వెంకటశివన్నారాయణ, డీఎస్పీ జి.రామాంజనేయులు, తహసీల్దార్ షేక్.సలీమా, ఎండీ సాధిక్ తదితరులు పాల్గొన్నారు.

పాఠశాల నిర్వాహణపై దృష్టి సారించాలి

బాపట్ల, పురపాలకసంఘం ఉన్నత పాఠశాల నిర్వాహణ, పిల్లల క్రమశిక్షణపై దృష్టి సారించాలని కలెక్టర్ వినోద్‌కుమార్ పాఠశాల ప్రధానోపాధ్యాయులను ఆదేశించారు. గురువారం పురపాలక సంఘం ఉన్నత పాఠశాల ఆవరణంలో భవిత, ఆటిజం కేంద్రాల ఏర్పాటుకు కలెక్టర్ స్థల పరిశీలన చేశారు. ఈ సందర్భంగా పురపాలకసంఘ ఉన్నత పాఠశాల ఆవరణంలో కొత్త, పాత భవనాల్లోని తరగతి గదులను పరిశీలించారు. విద్యార్థుల సంఖ్య, విభాగాల వివరాలపై ప్రధానోపాధ్యాయిని బి.రాజశ్రీని అడిగి ఆరా తీశారు. తరగతుల విభాగాలను పూర్తిస్థాయిలో కొత్తభవనంలోకి వారం రోజుల్లో మార్చటానికి చర్యలు తీసుకోవాలన్నారు. పాతభవనం ఖాళీ చేసిన అనంతరం బాగున్నటువంటి తరగతి గదుల్లో మూడింటిని భవితా కేంద్రం కోసం మరో మూడింటిని ఆటిజం కేంద్రం నిర్వాహణ కోసం కేటాయించాలని అధికారులకు సూచించారు. ఆంజనేయ అగ్రహారంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలను కలెక్టర్ పరిశీలించారు. కార్యక్రమంలో డీఈవో ఎస్.పురుషోత్తం, డిప్యూటీ కలెక్టర్ నాగిరెడ్డి, ప్రధానోపాధ్యాయిని డి.రాజశ్రీ, సమగ్రశిక్ష ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ నాగజ్యోతి, ఐఈడీ కోఆర్డినేటర్ జోత్స్న, ఎంఈవోలు తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లండి

• పార్టీని బలోపేతం చేయండి

• స్థానిక ఎన్నికలకు సిద్ధంకండి

• రాష్ట్ర కార్యదర్శి గూడపాటి



ప్రమాణ స్వీకారం చేయిస్తున్న మంత్రి సోదరుడు అనగాని శివప్రసాద్, టీడీపీ నాయకులు

రేపల్లె, నవంబరు 13(ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ పథకాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకుని వెళ్ళి పార్టీని మరింత బలోపేతం చేసే దిశగా ముందు కెళ్లాలని టీడీపీ రాష్ట్ర కార్యదర్శి గూడపాటి శ్రీనివాసరావు అన్నారు. గురువారం టీడీపీ స్థానిక కార్యాలయంలో నూతనంగా ఎన్నికైన గ్రామ అధ్యక్షులు, క్లస్టర్ యూనిట్ అధ్యక్షులు, మండల స్థాయి నాయకులు అనుబంధ విభాగాలతో ప్రమాణ స్వీకారం నిర్వహించారు. మంత్రి సోదరుడు అనగాని శివప్రసాద్ జెండా ఎగురవేసి కేక్‌కట్ చేశారు. ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తీరప్రాంతంలోని వెనుకబడిన నియోజకవర్గమైన రేపల్లెను మంత్రి అనగాని సత్యప్రసాద్ ప్రత్యేక దృష్టి సారించి అభివృద్ధి పథంలో నడుపుతున్నారన్నారు. గ్రామస్థాయి నుంచి అభివృద్ధి చేశారన్నారు. నియోజకవర్గంలో కోట్లాది రూపాయలు నిధులు వెచ్చించి రహదారులు, డ్రెయిన్లు కాల్వలు పురపాలక సంఘాన్ని అన్ని విధాలా అభివృద్ధి చేశారన్నారు. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో అభివృద్ధి శూన్యమన్నారు. నూతనంగా ఎన్నికైన గ్రామస్థాయి నుంచి మండల స్థాయి నాయకులు ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకునివెళ్ళి పార్టీని మరింత బలోపేతం చేయాలని సూచించారు. మంత్రి సోదరుడు అనగాని శివప్రసాద్ మాట్లాడుతూ కూటమి అధికా రం చేపట్టిన 17నెలలు కాలంలో వందల కోట్ల రూపాయలతో తీరప్రాంతాన్ని అభివృద్ధి చేశారన్నారు. కృష్ణాపశ్చిమ డెల్టా ప్రాజెక్టు కమిటీ చైర్మన్ పంతాని మురళీధరరావు, సంగం డెయిరీ డైరెక్టర్ ఎన్‌వీకే ప్రసాద్ ప్రసంగించారు. ఈ కార్యక్రమంలో దుర్గామల్లేశ్వరస్వామి దేవస్థానం కమిటీ సభ్యులు జీవీ నాగేశ్వరరావు, మార్కెట్ యార్డు చైర్మన్ ఓగిబోయిన వెంకట్‌యాదవ్, జడ్పీటీసీలు నర్రాసుబ్బయ్య, నాగమణి, మండల అధ్యక్షుడు తాతాఏడుకొండలు, రేపల్లె రామాంజనేయులు, దండుప్రోలు వెంకటేశ్వరరావు, చింతలసుబ్బారావు, మేకారామకృష్ణ, కొక్కిలిగడ్డ వెంకటేశ్వరరావు, దివిరాంబాబు, వెనిగళ్ల సుబ్రహ్మణ్యం, యలవర్తి లక్ష్మి, జీపీ రామారావు, నూతనంగా ఎన్నికైన నాయకులు తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా పంచ మండపాల పడిపూజ



చినపరిమి మహాపడిపూజలో పాల్గొన్న అయ్యప్పస్వాములు

కొల్లూరు, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి) : పంచ మండపాల పడిపూజలో భాగంగా 108 కలశాలను అయ్యప్పస్వాములు ఊరేగింపుగా తీసుకువచ్చారు. గురువారం సాయంత్రం కొల్లూరులోని అయ్యప్పస్వామి ఆలయంలో భక్తులు 108 కలశాలను కేరళ నృత్య సంప్రదాయంలో తలపై ఉంచుకుని నృత్యాలు చేస్తూ పంచ మండపాల వద్దకు తరలి వచ్చారు. కావడిలో అయ్యప్పస్వామి ప్రతిమను తీసుకువచ్చారు. అనంతరం పడిపూజలో కలశాలను ఉంచి పూజ కార్యక్రమాలను కొల్లిపరకు చెందిన నీలం పూర్ణగురుస్వామి జరిపారు. పంచ మండపాల పడిపూజ మహోత్సవానికి టీడీపీ మండల అధ్యక్షుడు మైనేని మురళీకృష్ణ, గృహలక్ష్మి కన్‌స్ట్రక్షన్ అధినేత తుమాటి శ్యాంబాబు తమ సహాయ సహకారాలు అందించారు.పడిపూజ కార్యక్రమానికి పరిసర గ్రామాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు, స్వాములు తరలి వచ్చారు.

చినపరిమిలో మహా పడిపూజ

చుండూరు, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి) : చినపరిమిలో శ్రీ అయ్యప్పస్వామి మహా పడిపూజ మహోత్సవం బుధవారం రాత్రి వేడుకగా నిర్వహించారు. మండల గ్రామాల నుంచి అయ్యప్పలు తరలి వచ్చి ఈ పూజా కార్యక్రమంలో భక్తి శ్రద్ధలతో పాల్గొన్నారు. ఆళ్ల సామిరెడ్డి లావణ్య, గౌరీశంకర్ గురుస్వామి, దప్పు శ్రీను గురుస్వామి ఆధ్వర్యంలో మహా పడిపూజ కార్యక్రమాలు జరిగాయి.

ప్రధాన ఎన్నికల అధికారి సూచనలు పాటించాలి


• నియోజకవర్గ అధికారి నాగిరెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న ఎన్నికల అధికారి నాగిరెడ్డి

వేమూరు, నవంబరు 13(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సూచనలను తూచా తప్పకుండా పాటించాలని నియోజకవర్గ ఎన్నికల అధికారి నాగిరెడ్డి సూచించారు. గురువారం వేమూరు తహసీల్దార్ కార్యాలయంలో రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్ కార్యక్రమానికి నాగిరెడ్డి హాజరయ్యారు. కాన్ఫరెన్స్ అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో అధికారి మాట్లాడుతూ ఎస్ఐఆర్ 2026కు సంబంధించిన ప్రతిఒక్కరికి ముందస్తు శిక్షణ ఇస్తారన్నారు. బీఎల్‌వోలు సర్వేలో భాగంగా ప్రతి ఓటరు ఇంటిని మూడుసార్లు విజిట్ చేయాలన్నారు. ఈ సందర్భంగా ఓటరు జాబితాలో ఉన్న కుటుంబసభ్యుల వివరాలు సవివరంగా సేకరించే అవకాశం ఏర్పడుతుందన్నారు. సమాచారాన్ని సంబంధించిన పారమ్స్ పూర్తి చేసే విషయంలో పూర్తి అవగాహనతో పాటు ప్రతి కాలమును పూర్తి చేయాలన్నారు. సర్వే సమాచారాన్ని బూత్ లెవల్ ఏజెంట్లకు తెలియజేయాలన్నారు. 2002 ఓటర్ల జాబితాలోని ఓటర్లను 2025కు మ్యాపింగ్ చేయడం జరిగింది. సంఖ్యలను పూర్తి పరిశీలించి ఇంటింటి సర్వే అనుసరిస్తూ కుటుంబ సభ్యులను ఒకే వరుసలోకి చేర్చాలని సూచించారు. సమస్య ఏర్పడితే వెంటనే ఉన్నతాధికారి సలహా మేరకు వ్యవహరించాలన్నారు. సమావేశంలో డీటీ రవీంద్ర, ఎన్నికల డీటీ జేమ్స్‌పాల్, ఎన్నికల టెక్నికల్ అసిస్టెంట్ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

మూడు నెలల క్రితం అగ్రి టెస్టింగ్ ల్యాబ్ మూత



మూడు నెలల నుంచి తాళం వేసి ఉన్న అగ్రి టెస్టింగ్ ల్యాబ్

వేమూరు, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): నియోజకవర్గ పరిధిలోని రైతుల ప్రయోజనం కోసం ప్రభుత్వం వేమూరులో ఏర్పాటు చేసిన రాష్ట్ర ప్రభుత్వ వ్యవసాయశాఖ అగ్రి టెస్టింగ్ ల్యాబ్ మూడు నెలల క్రితం మూత పడ్డది. దీనిపై దృష్టి పెట్టే అధికారులు లేకపోయారు. ఇందులో పని చేసే టెక్నికల్ ఏఈవో పదోన్నతిపై బదిలీ అయ్యారు. ఆ తదుపరి మరొకరిని ఇక్కడ నియమించలేదు. దీంతో భవనం చుట్టూ పిచ్చి మొక్కలు బాగా పెరగడంతో పాటు విషపూరిత జంతువులు తిరుగుతున్నాయి. ల్యాబ్ లోపల ఉన్న రూ.50 లక్షలకు పై ఖరీదు చేసే పరికరాలు దెబ్బతినే పరిస్థితి ఏర్పడింది. దీనిలో విత్తనాల శాంపిల్స్ పరీక్షలు జరిగేవి. ఫర్టిలైజర్ పరీక్షలకు సంబంధించిన పరికరాలు ఉన్నప్పటికీ సంబంధించిన టెక్నీషియన్ నియామకం జరగకపోవడంతో పరికరాల నిష్ప్రయోజనంగా పడి ఉన్నాయి. ల్యాబ్ మూతపడి ఉన్న విషయం ఉన్నతాధికారులకు తెలిసినప్పటికీ తిరిగి సిబ్బందిని నియమించే విషయంలో నిర్లక్ష్యం చూపుతున్నారు. అధికారులు స్పందించి రైతుల ప్రయోజనం కోసం ఏర్పాటు చేసిన ల్యాబ్ అందుబాటులోకి వచ్చే విధంగా సిబ్బందిని ఏర్పాటు చేసి సహకరించాలని రైతులు కోరుతున్నారు.

అర్చకులు ఆన్‌లైన్‌లో రెన్యువల్ చేసుకోవాలి

• సేవాసంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి గోపిచంద్



పిట్టలవానిపాలెం, నవంబరు 13(ఆంధ్రజ్యోతి): ధూప దీప నైవేద్య పథకం ద్వారా రూ.10వేలు ధార్మిక పరిషత్ ద్వారా కనీస వేతనం రూ.15వేలు లబ్ధిపొందుతున్న అర్చకులు, దేవదాయశాఖ ద్వారా వేదపండిత సంభావన రూ.3వేలు లబ్ధిపొందుతున్న వారు రెన్యువల్ చేసుకోవాలి. ఏపీ దేవదాయశాఖ వారి ద్వారా ఆన్‌లైన్ ప్రక్రియ జరుగుతుందని కావున లబ్ధిదారులు వారి వివరాలను దేవదాయశాఖ మండల ఇన్‌చార్జిలకు, కార్యనిర్వాహణాధికారికి అందజేయాలని బాపట్ల జిల్లా అర్చక సేవాసంఘం ప్రధాన కార్యదర్శి బృందావనం గోపిచంద్ గురువారం తెలిపారు.

మైనేనికి అభినందనల వెల్లువ



మైనేనికి అభినందనలు తెలియజేస్తున్న నాయకులు, కార్యకర్తలు

కొల్లూరు, నవంబరు 13(ఆంధ్రజ్యోతి): టీడీపీ మండల అధ్యక్షుడు మైనేని మురళీకృష్ణకు అభినందనలు వెల్లువెత్తాయి. 8వ సారి కొల్లూరు మండల అధ్యక్షుడిగా ప్రమాణ స్వీకారం చేసిన మైనేనిని గురువారం ఆయన గృహంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్చాలు, పూలమాలలు అందించి దుశ్శాలువాలతో సత్కరించారు. ఈ సందర్భంగా మైనేని మాట్లాడుతూ ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు తనపై ఎంతో నమ్మకంతో మండల పార్టీ బాధ్యతలు అప్పగించారని, ఆయన నమ్మకం వమ్ము కాకుండా పార్టీని బలోపేతం చేసి రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీ అభ్యర్థులను గెలిపించి పార్టీ విజయానికి కృషి చేస్తానని పేర్కొన్నారు. ఎన్నో ఏళ్లుగా తనను వెన్నంటి ప్రోత్సహిస్తున్న నాయకులు, కార్యకర్తలు, ప్రజలకు ఆయన ధన్యవాదాలు తెలియజేశారు. అనంతరం గృహలక్ష్మి కన్‌స్ట్రక్షన్స్ యజమాని తూమాటి శ్యాంబాబు అభిమానంతో తెచ్చిన కేక్‌ను కట్ చేసి కార్యకర్తలకు పంపిణీ చేశారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు పెదపూడి నాగరాజు, కొమ్ము తులామాన్, యడ్ల శ్రీను, గాదె చంటి, ఏడుకొండలు, కుర్రా సత్యనారాయణ, బుర్రి జగన్, భువనేశ్వరరావు, తలశిల పవన్, పెదపల్లి రాంబాబు, జనసేన నాయకులు ఈమని మణికంఠ, పవన్ తదితరులు పాల్గొన్నారు.

తెలుగుయువత అధ్యక్షుడిగా బాలశంకర్‌రెడ్డి



కర్లపాలెం, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): : తెలుగుయువత మండల అధ్యక్షుడిగా ఆట్ల బాలశంకర్‌రెడ్డి నియమితులయ్యారు. గురువారం బాపట్లలో అధికారింగా ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ ప్రకటించినట్లు ఆట్ల బాలశంకర్‌రెడ్డి తెలిపారు.

ఎస్టీయూ నూతన కార్గవర్గం ఎన్నిక





చుండూరు, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి) : మండల ఎస్టీయూ నూతన కార్యవర్గ ఎన్నికలు గురువారం జరిగాయి. అధ్యక్షుడిగా తెనాలి వినోద్ కుమార్, కార్యదర్శిగా కాకుమాను నాగేశ్వరప్రసాద్, ఆర్థిక కార్యదర్శిగా ఎస్‌కె‌జాన్, గౌరవాధ్యక్షుడిగా ఎన్.వెంకటేశ్వరరావు, జిల్లా కౌన్సిలర్స్‌గా ఏకే జిలాని, ఎన్.ప్రసాద్‌బాబు, ఆర్.ఉమామహేశ్వరరావు, జె.ప్రసాద్‌బాబు, మహిళా కార్యదర్శిగా ఎ.అనిత, పి.పీటర్, యిర్మియా, కౌన్సిల్ పరిశీలకునిగా ముజాఫర్‌ఖాన్, కౌన్సిల్ పర్యవేక్షకుడిగా టి.చంద్రశేఖర్‌లు వ్యవహరించారు.

విద్యార్థులకు నోట్‌పుస్తకాల అందజేత

నగరం, నవంబరు 13(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు విద్యతోపాటు క్రమశిక్షణను అలవాటుగా అలవర్చుకోవాలని తద్వారా ఉన్నత శిఖరాలు చేరుతారని మంత్రిపాలెం జడ్పీ ఉన్నత పాఠశాల హెచ్ఎం టీవీ నాగజ్యోతి అన్నారు. గురువారం బాలల దినోత్సవాన్ని పురస్కరించుకుని మండలంలోని మంత్రిపాలెం జడ్పీ ఉన్నత పాఠశాలలో గ్రామానికి చెందిన జాలాది నమోశివరావు-రమాదేవి దంపతులు 100మంది విద్యార్థులకు ప్యాడ్‌లు, నోటు పుస్తకాలు, పెన్నులు అందజేశారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో హెచ్ఎం టీవీ నాగజ్యోతి మాట్లాడుతూ విద్యార్థులను ప్రోత్సహించేందుకు తనవంతు సహకారాలు అందించాలని కోరారు. అనంతరం నమోశివరావు దంపతులను శాలువాలతో ఉపాధ్యాయులు సత్కరించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఎల్ఐసీ ప్రైవేటీకరణను మానుకోవాలి

రేపల్లె, నవంబరు 13(ఆంధ్రజ్యోతి): ఎల్ఐసీ ప్రైవేటీకరణ విధానాలను మానుకోవాలని ప్రభుత్వ రంగాన్ని కాపాడాలని సీఐటీయూ బాపట్ల జిల్లా ట్రెజరర్ సీహెచ్ మణిలాల్ అన్నారు. గురువారం ఆంధ్రరాష్ట్రంలో డిసెంబర్ 31 నుంచి 2026జనవరి 4వతేదీ వరకు జరుగుతున్న సీఐటీయూ అఖిల పార్టీ మహాసభల్లో భాగంగా ఎల్ఐసీ కార్యాలయంలో ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వరంగాన్ని కాపాడాలని, ఎల్ఐసీలో వాటాల అమ్మకాలను అరికట్టాలని సీఐటీయూ దేశవ్యాప్తంగా ఉద్యమాలు నిర్వహిస్తుందన్నారు. విశాఖలో జరిగే అఖిలభారత మహాసభలను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

కార్యకర్త కుటుంబానికి ప్రమాద బీమా చెక్కు



కార్యకర్త కుటుంబానికి ప్రమాద బీమా చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే ఆనందబాబు


భట్టిప్రోలు, కొల్లూరు, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన కార్యకర్త కుటుంబానికి ప్రమాద బీమా చెక్కును ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు గురువారం అందజేశారు. మండలపరిధిలోని ఓలేరు గ్రామానికి చెందిన టీడీపీ కార్యకర్త లంకె సాంబయ్య రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ కార్యకర్తల సంక్షేమం కోసం ఏర్పాటు చేసిన విభాగానికి కార్యకర్త ప్రమాద వివరాలు అందించి ఎమ్మెల్యే ఆనందబాబు సిఫారసు చేశారు. ఆయన సిఫారసుతో కార్యకర్త కుటుంబానికి మంజూరైన రూ.5 లక్షలు ఆర్థిక సాయాన్ని ఎమ్మెల్యే గుంటూరులోని క్యాంపు కార్యాలయంలో మృతుడి భార్యకు అందజేశారు. భర్తను కోల్పోయిన తనకు ఆసరాగా నిలిచి ప్రమాద బీమా అందించిన నారా లోకేశ్, ఆనందబాబుకు కృతజ్ఞతలు తెలిపారు.

మృతుడి కుటుంబానికి ఆర్థిక సాయం

కర్లపాలెం, నవంబరు 13(ఆంధ్రజ్యోతి) : కర్లపాలెం మండలం పేరలి మేకలవారిపాలెంలో గురువారం దేవరపాటి మల్లమ్మ అనారోగ్యంతో మృతి చెందారు. పేరలి నరసయ్య చారిటబుల్‌ట్రస్ట్ తిమ్మరాజు కృష్ణమూర్తి, ట్రస్ట్ అధినేత బాలకృష్ణమూర్తి సహాయ సహకారంతో మట్టి ఖర్చులు నిమిత్తం పేరలి మాజీ సర్పంచ్ గొర్రుముచ్చు మీరయ్య, తుమ్మలపల్లి దర్శి శ్రీను, చింతాయపాలెం సొసైటీ చైర్మన్ బుల్లియ్య చేతుల మీదగా రూ.5వేలు అందజేశారు.


ఆర్టీసీలో అప్రెంటిస్ షిప్ కోసం దరఖాస్తులు స్వీకరణ

కర్లపాలెం, నవంబరు 13(ఆంధ్రజ్యోతి): ఏపీఎస్ ఆర్టీసీ నందు ఐటీఐ అప్రెంటిస్ షిప్ చేయడానికి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు జోనల్ సిబ్బంది శిక్షణ కళాశాల ప్రిన్సిపాల్ నీలిమా ఓ ప్రకటనలో తెలిపారు. ఎన్టీఆర్, కృష్ణా, గుంటూరు, బాపట్ల, పల్నాడు, ఏలూరు, పశ్చిమ గోదావరి జిల్లాల నందు ఐటీఐలో ఉత్తీర్ణులైన ఆసక్తిగల అభ్యర్థులు 15వ తేదీ నుంచి 30వ తేదీ వరకు డబ్ల్యూడబ్ల్యూ.అప్రంటీస్‌షిప్‌ఇండియా.గవర్నమెంట్.ఇన్ వెబ్‌సైట్ నందు ఆన్‌లైన్‌లో జిల్లాల వారీగా దరఖాస్తు చేసుకోవచ్చునని తెలిపారు. వివరాలకు డబ్ల్యూడబ్ల్యూ.ఏపీఎస్‌ఆర్‌టీసీ.ఏపీ.జీఓవీ.ఇన్‌లో రిక్రూమెంట్స్ కోసం చూడగలరని తెలిపారు.



కార్డులు తీసుకోకపోతే అంతే..!

- మిగిలిన వాటిని వెనక్కి పంపనున్న అధికారులు
- లబ్ధిదారులు రేషన్ కార్డులు కోల్పోయే పరిస్థితి
- ఇప్పటికే 85 శాతం స్మార్ట్ కార్డుల పంపిణీ



సత్తెనపల్లి, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం పారదర్శక పాలన నేపథ్యంలో పాత రేషన్ కార్డులకు స్వస్తి పలికింది. ఇదే క్రమంలో రాజముద్రతో క్యూఆర్ కోడ్, కుటుంబ పెద్ద ఫోటో తదితర సమగ్ర వివరాలతో కొత్త స్మార్ట్ కార్డుల పంపిణీకి శ్రీకారం చుట్టింది. పల్నాడు జిల్లాలో ఇప్పటికే 85 శాతానికి పైగా స్మార్ట్ కార్డుల పంపిణీ పూర్తయింది. ఇంకా 85,993 కార్డుదారులకు కార్డులు అందాల్సి ఉంది. కార్డుదారులు త్వరపడి తమ కార్డులను తీసుకోకపోతే అవి వెనక్కి వెళ్ళే అవకాశం ఉంది. ఈ నెలాఖరుకు మిగిలిన కార్డుదారులు ఆయా స్మార్ట్‌కార్డులు తీసుకోవాలి, వివిధ కారణాల నేపథ్యంలో ఎవరైనా తీసుకోకపోతే అధికారులు వాటిని వెనక్కి పంపుతారు. దీంతో లబ్ధిదారులు కార్డును కోల్పోయే అవకాశం ఉంది. ఇప్పటికీ 85 శాతం స్మార్ట్‌కార్డుల పంపిణీ పూర్తి కాగా మరో 15 శాతం మందికి కార్డులు అందజేయాల్సి ఉందని అధికారులు చెబుతున్నారు. కొందరు ఇతర జిల్లాలు, రాష్ట్రాలకు వలస వెళ్లారని, కొన్ని ఇతర కారణాల వల్ల పంపిణీలో కొంత జాప్యం జరిగిందని అంటున్నారు. కార్డులోని లబ్ధిదారుల్లో ఎవరైనా వచ్చి కార్డు తీసుకునే వెసులుబాటును కల్పించామని అధికారులు చెబుతున్నారు. కాగా, లబ్ధిదారులు స్మార్ట్ కార్డులు తీసుకోకపోతే అధికారులు వాటిని వెనక్కి పంపుతారు. భవిష్యత్తులో ఆయా లబ్ధిదారులు రేషన్ కార్డులు కోల్పోయే ప్రమాదం ఉంటుంది. లబ్ధిదారులు వీలైనంత త్వరగా స్మార్ట్‌కార్డులను తీసుకువెళ్ళటం మంచిదని అధికారులు చెబుతున్నారు. ఇటు అధికారులు, అటు లబ్ధిదారులు అప్రమత్తమై స్మార్ట్‌కార్డుల పంపిణీ వంద శాతం పూర్తయ్యేలా చూడాల్సిన అవసరం ఉంది.

రేషన్ బియ్యం పట్టివేత

చేబ్రోలు, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మంచాల గ్రామం అడ్డరోడ్డు వద్ద పోలీసులు తెల్లవారు జామున వాహనాలను తనిఖీ చేస్తుండగా భారీగా రేషన్ బియ్యం పట్టుబడింది. పొన్నూరు మండలం కసుకూరు గ్రామానికి చెందిన డీలర్ నుంచి 79 బస్తాల రేషన్ బియ్యాన్ని ట్రాలీ వాహనంలో చుండూరు మండలంలోని సుబ్బారావుకు చెందిన రైస్ మిల్‌కు తరలిస్తుండగా చేబ్రోలు ఎస్ఐ వీరనారాయణ తన సిబ్బందితో కలిసి పట్టుకున్నారు. ఈ ఘటనలో డ్రైవర్ కె. రమేష్, వాహన యజమాని కత్తి రమేష్, బియ్యం కొనుగోలు దారుడు పొన్నూరుకు చెందిన రబ్బాని, విజయ్‌కుమార్‌లపై కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

దుగ్గిరాల యార్డులో పసుపు ధరలు

దుగ్గిరాల, నవంబరు 13(ఆంధ్రజ్యోతి): దుగ్గిరాల యార్డులో గురువారం జరిగిన వేలంలో 831 బస్తాల పసుపును రైతులు వ్యాపారులకు విక్రయించారు. కొమ్ములు క్వింటాల్‌కు కనిష్ఠధర రూ. 11,900, గరిష్ఠధర రూ. 13,521, మోడల్‌ధర రూ.12,350 పలికాయి. కాయ క్వింటాల్‌కు కనిష్ఠధర రూ.11,900, గరిష్ఠధర రూ.13,521, మోడల్‌ధర రూ. 12,350 పలికాయి.

నవభారత నిర్మాత నెహ్రూపై విమర్శలు తగవు

- మాజీ ఎంపీ డాక్టర్ ఎన్.తులసిరెడ్డి



ప్రసంగిస్తున్న మాజీ ఎంపీ తులసిరెడ్డి, వేదికపైన లక్ష్మణరావు తదితరులు

గుంటూరు కార్పొరేషన్, నవంబరు13 (ఆంధ్రజ్యోతి): భారత్ సమగ్రాభివృద్ధికి పునాదులు వేసిన నవభారత నిర్మాత పండిట్ జవహర్ లాల్ నెహ్రూపై విమర్శలు చేయడం తగదని, సంస్కృతి, సాంప్రదాయాలు, ఆచారాలను గౌరవించే ఆర్.ఎస్.ఎస్ లాంటి సంస్థలు సోషల్ మీడియాలో నెహ్రూను వ్యక్తిగతంగా తప్పు పట్టడం దురదృష్టకరమని మాజీ ఎంపీ, ఏపీ కాంగ్రెస్ మీడియా కమిటీ ఛైర్మన్ డాక్టర్ ఎన్.తులసిరెడ్డి పేర్కొన్నారు. గుంటూరులోని జనచైతన్య వేదిక హాలులో జన చైతన్య వేదిక ఆంధ్రప్రదేశ్ కమిటీ ఆధ్వర్యంలో దేశ ప్రగతిలో నెహ్రూజీ పాత్ర అనే అంశంపై జరిగిన చర్చా గోష్టిలో ప్రధాన వక్తగా ఆయన పాల్గొన్నారు. నెహ్రూ మిశ్రమ ఆర్థిక వ్యవస్థను ప్రవేశపెట్టి.. పంచవర్ష ప్రణాళికలను అమలు చేసి, అతి పేదరికంలో ఉన్న భారత్‌ను ముందుకు నడిపిన మహనీయుడని కొనియాడారు. అమెరికా, రష్యా కూటముల వైపు మొగ్గకుండా అలీన ఉద్యమానికి నాయకత్వం వహించి ప్రపంచ నాయకుడిగా గుర్తింపు పొందారన్నారు. మాజీ మంత్రి డొక్కా మాణిక్య వరప్రసాద్ మాట్లాడుతూ.. సామాజిక మధ్యమాలలో నెహ్రూ గురించి 79 తప్పుడు కథనాలను ప్రచారం చేస్తున్నారన్నారు. నెహ్రూకు షేక్ అబ్దుల్లా, మహారాజ హరిసింగ్‌తో గల సత్సంబంధాల వల్ల నేడున్న జమ్మూ కశ్మీర్ ను కాపాడుకోగలిగామన్నారు. మాజీ ఎమ్మెల్సీ కె.ఎస్. లక్ష్మణరావు మాట్లాడుతూ.. ఐఐటీ, ఐఐఎం, ఇస్రో, ఎయిమ్స్ , సీఎస్ఐఆర్, డీఆర్‌డీఓ, ఆర్‌ఈసీ లాంటి విద్య పరిశోధన సంస్థలను, నాగార్జునసాగర్, హీరాకుడ్, భాక్రానంగల్ లాంటి బహుళార్థ సాధక నీటి ప్రాజెక్టులను, బీహెచ్‌ఈఎల్, ఐడీపీఎల్, సెయిల్, కోల్ ఇండియా లాంటి పారిశ్రామిక సంస్థలను ప్రారంభించి అభివృద్ధి చేసి దేశం వేగంగా పయనించడానికి నెహ్రూ కారణ భూతుడైనాడని తెలిపారు. సభకు జనచైతన్య వేదిక రాష్ట్ర అధ్యక్షుడు వల్లంరెడ్డి లక్ష్మణరెడ్డి అధ్యక్షత వహించారు. ఏఎన్‌యూ పూర్వ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ ఎన్. రంగయ్య, కేంద్రీయ విశ్వవిద్యాలయ పూర్వ ఆచార్యులు కొండవీటి చిన్నయసూరి, ప్రముఖ విద్యావేత్త ప్రొఫెసర్ డి.ఎ.ఆర్. సుబ్రహ్మణ్యం, జనచైతన్య వేదిక రాష్ట్ర ప్రధాన కార్యదర్శి టి.ధనుంజయ రెడ్డి, దళిత బహుజన ఫ్రంట్ వ్యవస్థాపకుడు కొరివి వినయ్ కుమార్, ప్రభుత్వ మెడికల్ కళాశాలల పరిరక్షణ కమిటీ రాష్ట్ర కన్వీనర్ డాక్టర్ ఆలా వెంకటేశ్వర్లు , రేట్ పేయర్స్ అసోసియేషన్ అధ్యక్షులు ఓరుగంటి నారాయణరెడ్డి, వ్యవసాయ శాస్త్రవేత్త ప్రొఫెసర్ ఎస్.వేణుగోపాల్, తెలుగు సాహితీవేత్త వి. సింగారావు, సీనియర్ జర్నలిస్ట్ చలపతిరావు తదితరులు పాల్గొన్నారు.

అక్క కొడుకుని కాపాడబోయి..యువతి మృతి


కోటా మల్లేశ్వరి (ఫైల్ ఫోటో)

వినుకొండటౌన్, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): అక్క కొడుకుని కాపాడే క్రమంలో చెరువులో పడి యువతి మృతి చెందిన ఘటన.. విష్ణుకుండి నగర్ సమీపంలోని గాయత్రి నగర్‌లో గురువారం చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన కథనం మేరకు పదేళ్ల క్రితం తెలంగాణకు చెందిన మృతురాలు తండ్రి కోటా రాములుతో పాటు మరో నాలుగు కుటుంబాలకు చెందిన వారంతా వినుకొండ వచ్చి గాయత్రి నగర్‌లో పరదాలు వేసుకుని, మేకలు మేపుతూ జీవనం సాగిస్తున్నారు. ఈ నేపథ్యంలో మేకలను మేపుతూ చేతులకు అయిన మట్టిని కడుక్కునేందుకు గాయత్రీ నగర్‌లోని చెరువులోకి దిగి చితకాయల శివ ప్రమాదశాత్తు జారి పడిపోయాడు. బహిర్భూమికి వెళ్లిన కోటా మల్లేశ్వరి (19) (శివకు పిన్ని వరుస) ఇది గమనించి తన చున్ని సాయంతో శివను కాపాడే ప్రయత్నం చేసింది. అయితే.. మల్లేశ్వరి జారి చెరువులో పడిపోవడంతో.. నీటిలో మునిగి బయటకు రాలేకపోయింది. ప్రమాదం నుంచి బయట పడిన శివ కేకలు వేయడంతో సమీపంలోని స్థానికులు వచ్చి కాపాడేందుకు ప్రయత్నించినా ఫలితం లేకపోయింది. దీంతో పోలీసులకు సమాచారం అందించారు. వారు వచ్చి యువతిని రక్షించి.. చికిత్స కోసం వైద్యశాలకు తరలించారు. అప్పటికే యువతి పరిస్థితి ఆందోళన కరంగా ఉంది. నీరు అధికంగా తాగడంతో మల్లేశ్వరి మృతి చెందినట్లు వైద్యులు తెలపడంతో బంధువులు కన్నీరు మున్నీరుగా విలపించారు. మృతదేహాన్నీ పోస్టుమార్టం కోసం వినుకొండ ప్రభుత్వ వైద్యశాల మార్చురీకి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

అచ్చంపేట పీఏసీఎస్‌లో..
రూ.2.60 లక్షల నగదు మాయం

అచ్చంపేట, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): అచ్చంపేటలోని ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘంలో రూ.2.60 లక్షల నగదు మాయమైన ఘటన గురువారం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. గత శనివారం కౌంటర్‌లో ఉన్న ఎరువు, పొదుపు నగదు మాయమైంది. ఈ నేపథ్యంలో గత సోమవారం ఉదయం పోలీస్‌స్టేషన్లో ఫిర్యాదు చేశారు. సీఐ శ్రీనివాసరావు తన సిబ్బందితో వచ్చి పీఏసీఎస్ కార్యాలయంలో విచారించారు. మాయమైన నగదులో కొంతమేర నగదు వసూలు చేసినట్లు సొసైటీ అధ్యక్షుడు కొప్పురావూరి కోటేశ్వరరావు గురువారం తెలిపారు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది. పోలీసులు విచారిస్తున్నారు.

ప్రీ ఆర్డీసీకి ఏఎన్‌యూ విద్యార్థిని

ఏఎన్‌యూ, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం సీఎస్ఈ మూడవ సంవత్సరం ఎన్‌సీసీ క్యాడెట్ ఎస్.హర్షిత శివాని సికింద్రాబాద్‌లో జరగనున్న ప్రీ ఆర్డీసీ(రిపబ్లిక్ డే క్యాంప్) శిబిరానికి ఎంపికైంది. గుంటూరు గ్రూప్ తరపున 25(ఏ) బెటాలియన్ ఇంటర్ గ్రూప్ పోటీల్లో (ఐజీసీ) కేటగిరీలో ప్రతిభ కనబరిచి ఎంపిక కావడం విశేషం. ఈ సందర్భంగా వీసీ కె.గంగాధరరావు, రెక్టార్ శివరామ్ ప్రసాద్, రిజిస్ట్రార్ సింహాచలం హర్షిత శివానిని అభినందించారు.

రైల్వే డీసీఎం కమలాకర్‌బాబు విజయవాడకు బదిలీ



డీసీఎం కమలాకర్‌బాబుని సత్కరిస్తున్న కమర్షియల్ విభాగం ఉద్యోగులు

గుంటూరు, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): గుంటూరు రైల్వే డివిజనల్ కమర్షియల్ మేనేజర్ కె.కమలాకర్‌బాబు విజయవాడ డివిజన్‌కు బదిలీ అయ్యారు. ఈ మేరకు రైల్వే బోర్డు నుంచి ఉత్తర్వులు జారీ కాగా ఆయన గురువారం తన బాధ్యతల నుంచి రిలీవింగ్ అయ్యారు. ఈ సందర్భంగా పట్టాభిపురంలోని రైల్ వికాస్ భవన్‌లో ఆయనకు వీడ్కోలు కార్యక్రమం జరిగింది. సీనియర్ డీసీఎం ప్రదీప్‌కుమార్ మాట్లాడుతూ డీసీఎంగా కమలాకర్‌బాబు డివిజన్‌లో రెవెన్యూ అభివృద్ధికి, ప్రయాణీకుల సౌకర్యాలు మెరుగుపరచడానికి విశేషంగా కృషి చేశారన్నారు. కమలాకర్‌బాబు మాట్లాడుతూ తనకు విధి నిర్వహణలో సహకరించిన అధికారులు, ఉద్యోగులందరికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో డీసీఎం వినయ్‌కాంత్, కమర్షియల్ విభాగం అధికారులు పాల్గొన్నారు.

పీఎఫ్ సమస్యలను
పది రోజుల్లో పరిష్కరించాలి

- లేదంటే జడ్పీ కార్యాలయం ఎదుట ఆందోళన:ఏపీటీఎఫ్


జడ్పీ ఛైర్ పర్సన్ కత్తెర హెనీ క్రిస్టినాకు వినతి పత్రం అందజేస్తున్న ఏపీటీఎఫ్ నేతలు

గుంటూరు సిటీ/ గుంటూరు (విద్య) నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి గుంటూరు జిల్లా వ్యాప్తంగా ఉన్న వివిధ క్యాడర్ల ఉపాధ్యాయులు, ప్రధానోపాధ్యాయులు, మండలవిద్యాశాఖాధికారుల పీఎఫ్ సమస్యలు పది రోజుల్లో పరిష్కరించాలని ఏపీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు కె.బసవలింగారావు డిమాండ్ చేశారు. పది రోజుల్లో పీఎఫ్ సమస్యలు పరిష్కరించకపోతే జిల్లా పరిషత్ కార్యాలయం ఎదుట ఆందోళన కార్యక్రమం చేపడతామని హెచ్చరించారు. గురువారం జిల్లా పరిషత్ ఛైర్‌పర్సన్ కత్తెర హెనీ క్రిస్టినా, డిప్యూటీ సీఈవో కృష్ణను కలిసిన ఏపీటీఎఫ్ జిల్లా అధ్యక్షులు బసవలింగారావు, మహమ్మద్ ఖాలీద్ వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా బసవలింగారావు మాట్లాడుతూ, గత తొమ్మిది నెలలుగా పీఎఫ్ సమస్యలు పరిష్కరించకుండా ఫైల్స్ పక్కన పడేశారని ఆరోపించారు. క్లోజర్స్ క్లియరెన్స్ మిసింగ్ క్రెడిట్స్ అప్‌డేషన్‌లో కార్యాలయ సిబ్బంది జాప్యం వల్ల పదవీ విరమణ చేసిన, చేయబోయే ఉపాధ్యాయులు ఆందోళన చెందుతున్నారన్నారు. మిస్సింగ్ క్రెడిట్స్‌ను అప్డేట్ చేయకుండా ఖాతాలో ఉన్నవరకు ఇస్తే సరిపోతుందని అన్నారు. కాని భవిష్యత్తులో తేడా అమౌంట్‌కు క్లెయిమ్ చేయబోమని సెల్ఫ్ డిక్లరేషన్‌ను ఉపాధ్యాయుల నుంచి బలవంతంగా తీసుకుంటున్నారని, అలాంటి అధికారం ఎవరిచ్చారని ప్రశ్నించారు. ఈ సమస్యలను త్వరలోనే పరిష్కరించేలా చర్యలు తీసుకుంటామని ఛైర్‌పర్సన్ హెనీ క్రిస్టినా, డిప్యూటీ సీఈవో కృష్ణ ఉపాధ్యాయ సంఘం నేతలకు హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఏపీటీఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు పి.నాగశివన్నారాయణ, జిల్లా కార్యదర్శి జి.దాస్, జిల్లా పూర్వ ప్రధానకార్యదర్శి ఎమ్.హనుమంతరావు, జిల్లా కౌన్సిలర్లు ఆర్.బాలరాజు, కృష్ణారావు, జహంగీర్, కుంబా శ్రీనివాస్, గురుమూర్తి, తదితరులు పాల్గొన్నారు.

ఆచార్య రత్నషీలామణికి ఘన సత్కారం


రత్నషీలామణిని సత్కరిస్తున్న వర్సిటీ సిబ్బంది

ఏఎన్‌యూ, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): ఏపీ ఉన్నత విద్యామండలి నూతన ఉపాధ్యక్షురాలిగా ఎంపికైన ఆచార్య కె.రత్నషీలామణికి ఏఎన్‌యూలో గురువారం ఘనంగా సత్కారం జరిగింది. సన్మాన కార్యక్రమానికి ఉపకులపతి ఆచార్య గంగాధరరావు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. సభకు ఏఎన్యూ పరీక్షల నియంత్రణ అధికారి ఏ.శివప్రసాదరావు అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా తాత్కాలిక ఉపకులపతి ఆచార్య కే.గంగాధరరావు మాట్లాడుతూ ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం అభివృద్ధిలో ఆచార్య కే.రత్నషీలామణి కీలకపాత్ర పోషించారన్నారు. గౌరవ అతిథిగా విచ్చేసిన ఏఎన్యూ తాత్కాలిక రెక్టర్ ఆచార్య ఆర్.శివరాం ప్రసాద్, మరొక గౌరవ అతిథి రిజిస్ట్రార్ ఆచార్య సింహాచలం, ఏఎన్యూ ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య సురేష్ కుమార్, ఏఎన్యూ పాలకమండలి సభ్యుడు ఆచార్య జగదీష్ నాయక్, ఆచార్య సుమంత్ కుమార్, ఓఎస్డీ ఆచార్య రవికుమార్, ఫార్మసీ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య తేజోమూర్తి, పరీక్షల నియంత్రణ అధికారి ఏ.శివప్రసాదరావు, ఉద్యోగులు నాగలక్ష్మి, డి.ఈఈ వెంకటేశ్వరరావు, కనకరాజు, పరిశోధకులు ఆచార్య రత్నషీలామణిసేవలను కొనియాడారు.

గుంటూరు విద్యార్థి ఆత్మహత్య ఘటనలో
8 మంది సీనియర్లపై కేసు

- క్యాంపస్‌లో తల్లిదండ్రులు, విద్యార్థుల ఆందోళన
- బాధ్యులను కఠినంగా శిక్షించాలని డిమాండ్
- ఆర్జీయూకేటీ రిజిస్ట్రార్, పోలీసుల జోక్యం
- ఆ ఎనిమిది మంది విద్యార్థుల సస్పెన్షన్


ఆందోళన చేస్తున్న సృజన్ కుటుంబ సభ్యులు, విద్యార్థులు


విద్యార్థులతో మాట్లాడుతున్న పోలీసు అధికారులు

ఎచ్చెర్ల, నవంబరు 13(ఆంధ్రజ్యోతి): ఎచ్చెర్ల మండలం ఎస్.ఎం.పురంలోని ఆర్జీయూకేటీ (శ్రీకాకుళం ట్రిపుల్ ఐటీ క్యాంపస్) బీటెక్ విద్యార్థి ఆత్మహత్య ఘటనలో ఎనిమిది సీనియర్లపై పోలీసులు కేసు నమోదు చేశారు. వారిని క్యాంపస్ నుంచి సస్పెండ్ చేస్తున్నట్లు అధికారులు ప్రకటించారు. గుంటూరుకు చెందిన ప్రత్తిపాటి సృజన్(20) ఇక్కడ ఇంజనీరింగ్ ఈఈఈ బ్రాంచ్‌లో తృతీయ సంవత్సరం చదువుతూ.. బుధవారం ఆత్మహత్య చేసుకున్న విషయం తెలిసిందే. సృజన్ తల్లిదండ్రులు జ్యోతి, శివకృష్ణప్రసాద్ గురువారం ఉదయం 6 గంటలకు క్యాంపస్‌కు చేరుకున్నారు. తన కుమారుడి మృతికి క్యాంపస్‌లో పర్యవేక్షణ లోపమే కారణమని బోరున విలపించారు. తమకు న్యాయం చేయాలంటూ ఆందోళనకు దిగారు. విద్యార్థులు కూడా వారిని ఓదార్చే ప్రయత్నం చేస్తూ.. క్యాంపస్ డైరెక్టర్ కార్యాలయం బయట బైఠాయించి ఆందోళన చేపట్టారు. 'కొంతమంది సీనియర్ విద్యార్థుల వేధింపుల వల్లే మా కుమారుడు మృతి చెందాడు. ఆత్మహత్యకు గల కారణాలను పూర్తిస్థాయిలో వెలికితీయాలి. బాధ్యులను కఠినంగా శిక్షించాల'ని సృజన్ తల్లిదండ్రులు డిమాండ్ చేశారు. శ్రీకాకుళం డీఎస్పీ వివేకానంద, జేఆర్‌పురం సీఐ ఎం.అవతారం, ఎస్ఐలు వి.సందీప్‌కుమార్, జి.లక్ష్మణరావు, వై.మధుసూదనరావు పోలీసు బలగాలతో క్యాంపస్‌కు చేరుకుని పరిస్థితిని సమీక్షించారు. డీఎస్పీ వివేకానంద మాట్లాడుతూ మృతుని తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేస్తామని, చట్టం ముందు అందరూ సమానమేన్నారు.

- సృజన్ ఆత్మహత్యకు కారణమని ఆరోపిస్తూ మృతుడి తల్లి చేసిన ఫిర్యాదు మేరకు నాలుగో సంవత్సరం చదువుతున్న వివిధ బ్రాంచ్‌లకు చెందిన 8 మంది విద్యార్థులను పోలీసులు ఎచ్చెర్ల పోలీసుస్టేషన్‌కు తరలించారు. వీరిపై 108 బీఎన్ఎస్ సెక్షన్ కింద కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. శ్రీకాకుళం సర్వజనాసుపత్రిలో పోస్టుమార్టం నిర్వహించి మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించారు. దీంతో ఆందోళనకారులు కొంతమేరకు శాంతించారు. ఉదయం 11 గంటల తర్వాత విద్యార్థులు ఎవరి తరగతులకు వారు వెళ్లిపోయారు.

నిజనిర్ధారణకు అంతర్గత కమిటీ

ఆర్జీయూకేటీ శ్రీకాకుళం క్యాంపస్‌లో విద్యార్థి సృజన్ ఆత్మహత్యపై విచారణకు యూనివర్సిటీ అధికారులు అంతర్గత కమిటీని నియమించారు. కమిటీ సూచనల మేరకు 8 మంది విద్యార్థులను తక్షణమే సస్పెన్షన్ చేశామని వర్సిటీ అధికారులు ప్రకటించారు. ఆర్జీయూకేటీ రిజిస్ట్రార్ డాక్టర్ సండ్ర అమరేంద్రకుమార్ క్యాంపస్‌కు చేరుకుని విద్యార్థులు, అధికారులు, అధ్యాపకులతో మాట్లాడి పరిస్థితి చక్కదిద్దే ప్రయత్నం చేశారు.

న్యాయం చేయాలి

గతంలో కూడా ఇలాంటి సంఘటనలు జరిగాయని, ఈ సంఘటనకు బాధ్యులైనవారిపై చర్యలు చేపట్టాలని ఆర్జీయూకేటీ క్యాంపస్ అధికారులను కలిసి కోరామని ఎస్ఎఫ్ఐ జిల్లా నాయకులు డి.చంద్రశేఖర్, చిత్రిరాజు తెలిపారు. దళిత సంఘ నేతలు ముంజేటి కృష్ణమూర్తి, వై.గురుమూర్తి, జి.యోగేశ్వరరావు, బి.శశిభూషణరావు తదితరులు మృతి చెందిన విద్యార్థి కుటుంబానికి న్యాయం చేయాలని అధికారులను కోరారు.

ఎస్సీ వసతి గృహాన్ని సందర్శించిన కలెక్టర్


భోజనం నాణ్యతను పరిశీలిస్తున్న కలెక్టర్ అన్సారియా


గుంటూరు, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): కలెక్టర్ బంగ్లా రోడ్డులో ఉన్న పరివర్తన ఎస్సీ విద్యార్థినుల సంక్షేమ వసతి గృహాన్ని జిల్లా కలెక్టర్ ఏ.తమీమ్ అన్సారియా సందర్శించారు. గురువారం 'ఆంధ్రజ్యోతి'లో 'హాస్టల్‌లో.. ప్రెగ్నెన్సీ టెస్ట్ కిట్లు' అనే శీర్షికతో ప్రచురితమైన కథనానికి కలెక్టర్ స్పందించారు. హాస్టల్‌లో విద్యార్థులకు అందిస్తున్న ఆహారాన్ని తొలుత తనిఖీ చేశారు. స్వయంగా తిని రుచిని, నాణ్యతను పరిశీలించారు. ఈ సందర్భంగా విద్యార్థినులతో మాట్లాడారు. మంచి ఆశయంతో లక్ష్య సాధన దిశగా జీవిత లక్ష్యాన్ని నిర్ణయించుకోవాలని సూచించారు. చిన్నప్పటి నుంచే ఉన్నత లక్ష్యాల కోసం కృషి చేయాలని అందుకు తగిన ప్రణాళిక వేసుకోవాలని సూచించారు. విద్యార్థి దశ కీలకమైందని ఇటువంటి సమయంలో ప్రతి అంశాన్ని క్షుణ్ణంగా ఆలోచించి నిర్ణయం తీసుకోవాలని చెప్పారు. చదువుపై దృష్టి పెట్టడం వల్ల ఉన్నత స్థానాలకు చేరవచ్చని, సమాజంలో మంచి హోదాతో పాటు సమాజ హితానికి పాటు పడే అవకాశం కలుగుతుందని ఉద్బోధించారు. ఈ కార్యక్రమంలో జిల్లా సాంఘిక సంక్షేమ అధికారి యూ.చెన్నయ్య తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి గ్రంథాలయ వారోత్సవాలు


కార్యదర్శి వంకదారి సుబ్బరత్నమ్మ

గుంటూరు (విద్య), నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): జిల్లా గ్రంథాలయ సంస్థ ఆధ్వర్యంలో శుక్రవారం నుంచి గ్రంథాలయ వారోత్సవాలు నిర్వహిస్తున్నట్లు కార్యదర్శి వంకదారి సుబ్బరత్నమ్మ గురువారం తెలిపారు. ఉమ్మడి జిల్లావ్యాప్తంగా ఉన్న గ్రంథాలయాల్లో కార్యక్రమాలు నిర్వహించనునట్లు వెల్లడించారు. గ్రంథాలయ వారోత్సవాల ప్రారంభ వేడుకలు జిల్లా గ్రంథాలయ సంస్థలో నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈ నెల 15న పుస్తక ప్రదర్శన ఏర్పాటు చేసి పుస్తక పఠన ప్రాముఖ్యత వివరణ, 16న గ్రంథాలయ ఉద్యమంలో పాల్గొన్న ప్రముఖుల జీవిత చరిత్రల వివరణ, 17న కవి సమ్మేళనం, పుస్తక పఠనం, గ్రంథాలయాల ప్రాముఖ్యత గురించి రచయితల ద్వారా వివరణ, 18న పాఠశాల విద్యార్థులకు చిత్రలేఖనం వ్యాసరచన, క్రీడా పోటీలు, 19న మహిళా దినోత్సవం, 20న జాతీయ గ్రంథాలయ వారోత్సవాల ముగింపు కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

ప్రకాశం బ్యారేజి వద్ద తగ్గిన వరద ఉధృతి


ప్రకాశం బ్యారేజి దిగువకు విడుదలవుతున్న కృష్ణానది వరదనీరు

తాడేపల్లి టౌన్, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): ఎగువ ప్రాజెక్టుల నుంచి నీటి విడుదల తగ్గించడంతో ప్రకాశం బ్యారేజి వద్ద కృష్ణానది వరద ఉధృతి స్వల్పంగా కొనసాగుతోంది. ఎగువన ఉన్న పులిచింతల ప్రాజెక్టుతో పాటు ప్రధాన వాగుల నుంచి 17,731 క్యూసెక్కుల వరద నీరు గురువారం ఇన్‌ఫ్లోగా నమోదవుతుండగా 7,250 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నట్లు ఇరిగేషన్ జేఈ రాజేష్ తెలిపారు. బ్యారేజి రిజర్వాయర్‌లో 12 అడుగుల నీటి మట్టం కొనసాగుతుండగా తూర్పు డెల్టా కాలువకు 5,246 క్యూసెక్కులు, పశ్చిమ డెల్టాకు 5,009 క్యూసెక్కులు, గుంటూరు చానల్‌కు 226 క్యూసెక్కుల నీటిని వదులుతున్నట్లు జేఈ తెలిపారు.

సాగర్ ప్రాజెక్టులో 305.68 టీఎంసీలు..

విజయపురిసౌత్, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): నాగార్జున సాగర్ జలాశయం నీటిమట్టం గురువారం నాటికి 587.30 అడుగులు ఉంది. ఇది 305.68 టీఎంసీలకు సమానం. కుడి కాలువ ద్వారా 10వేల క్యూసెక్కులు, ఎడమ కాలువ ద్వారా 4,160 క్యూసెక్కులు, ప్రధాన జల విద్యుత్ కేంద్రం ద్వారా 12,627 క్యూసెక్కులు, ఎస్ఎల్‌బీసీ ద్వారా 600 క్యూసెక్కులు, ఎల్ఎల్‌సి ద్వారా 300 క్యూసెక్కులు, మొత్తం ఔట్‌ఫ్లో వాటర్‌గా 27,687 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. శ్రీశైలం నుంచి నాగార్జున సాగర్‌కు 27,687 క్యూసెక్కుల నీరు వచ్చి చేరుతోంది.

పులిచింతలలో..

అచ్చంపేట, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): పులిచింతల ప్రాజెక్టులో గురువారం 43.06 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు పులిచింతల ప్రాజెక్ట్ ఏఈ రాజు తెలిపారు. ఎగువ నుంచి 10,544 క్యూసెక్కుల నీరు పులిచింతలకు వచ్చి చేరుతోందని చెప్పారు. ప్రాజెక్టు వద్ద పవర్ జనరేషన్ ద్వారా 7,600 క్యూసెక్కులు, లీకుల ద్వారా 400 క్యూసెక్కులు, మొత్తంగా 8 వేల క్యూసెక్కుల నీరు దిగువకు విడుదల చేస్తున్నట్లు ఏఈ తెలిపారు.

వితండ వివాదం!

- మిర్చి లారీల అడ్డగించిన.. యూనియన్ నాయకులు
- సౌత్ డీఎస్పీ, మిర్చి యార్డు సెక్రటరీకి ఎక్స్‌పోర్టర్ల ఫిర్యాదు


లాల్‌పురం వై-జంక్షన్ సమీపంలో మిర్చి లారీని అడ్డుకొన్న యూనియన్ నాయకులు

గుంటూరు, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): బంగ్లాదేశ్ బోర్డర్‌కు గుంటూరు నుంచి లోడింగ్ అయిన మిర్చి లారీలను యూనియన్ నాయకులు అడ్డుకొన్నారు. గురువారం రాత్రి యూనియన్‌కు చెందిన కొంతమంది కార్లలో వచ్చి లాల్‌పురం వైజంక్షన్, అంకిరెడ్డిపాలెం రోడ్డు సమీపంలో రెండు లారీలను అడ్డుకొని లారీ బ్రోకర్లు, డ్రైవర్లను పరుష పదజాలంతో దూషించారు. బయట నుంచి వచ్చిన లారీలను కిరాయికి పెట్టడానికి మీరెవరూ అంటూ వితండవాదం చేశారు. బంగ్లాదేశ్ బోర్డర్‌కు తమ యూనియన్ లారీలనే కిరాయికి పెట్టుకోవాలని హుకూం జారీ చేసి.. రెండు లారీలను కదలనీయకుండా అడ్డుపడ్డారు. దీంతో మిర్చి ఎగుమతిదారులు చేసేది ఏమి లేక సౌత్ డీఎస్పీతో పాటు గుంటూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ ఉన్నత శ్రేణి కార్యదర్శి ఎ.చంద్రిక దృష్టికి తీసుకెళ్లారు. ఇలాగైతే తాము జీఏంసీ పరిధిలో వ్యాపారం చేయలేమని చెప్పారు.


ఆర్డీవోకు వినతిపత్రం అందజేస్తున్న చిట్టీవాద రైతులు

మురుగు సమస్యను పరిష్కరించండి

● ఆర్డీవోకు పేరాల చిట్టీవాద రైతుల వినతి

పేరాల(చీరాల), నవంబరు 13 (ఆంధ్రజ్యోతి) : మొంథా తుఫాన్ కారణంగా పేరాల చిట్టీవాద పరిధిలో సుమారు 4 వేల ఎకరాల పంట నష్టం జరిగిందని అన్నదాతలు ఆవేదన చెందారు. తుఫాన్ కారణంగా సమీపంలోని మురుగు కాలువ నీటితో నిండి చేలల్లోకి మురుగు చేరినట్లు వివరించారు. ఈక్రమంలోనే మురుగు పారుదలకు చర్యలు చేపట్టి కనీసం రెండవ పంటకయినా సహకరించాలని కోరారు. ఈనేపథ్యంలోనే ఆర్డీవో చంద్రశేఖర్‌నాయుడుకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో చిట్టీవాద రైతులు అంకారావు, రమణయ్య, రాఘవరెడ్డి, కొండయ్య, రామకృష్ణ, వెంకటేశ్వర్లు, లాజర్, రమేష్‌బాబు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారంలో వేగంపెంచండి


డివిజన్ పరిధిలోని ఓటర్ల సమస్యల పరిష్కారంలో వేగం పెంచాలని ఎన్నికల శాఖ అధికారులు స్పష్టం చేశారు. గురువారం ఆ శాఖ అధికారులు నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో చీరాల మున్సిపల్ కార్యాలయం నుంచి ఆర్డీవో చంద్రశేఖర్‌నాయుడు, చీరాల, వేటపాలెం మండల తహసీల్దార్‌లు గోపీకృష్ణ, గీతారాణి, పలు ప్రభుత్వ విభాగాలకు చెందిన సిబ్బంది హాజరయ్యారు. ఈసందర్భంగా ఫారం 6,7,8లపై సుదీర్ఘంగా చర్చలు జరిగాయి. సమస్యలు వెంటనే పరిష్కరించాలని అధికారులు సూచించారు.

గ్రామాల్లో పచ్చదనం నిండేలా అధికారులు పనిచేయాలి

వేటపాలెం(చీరాల), నవంబరు 13 (ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలోని అన్ని గ్రామాల్లో పచ్చదనం నిండేలా పని చేయాలని వేటపాలెం ఎంపీడీవో రాజేష్‌బాబు చెప్పారు. గురువారం పంచాయతీ ప్రత్యేక అధికారులు, కార్యదర్శులకు 2025-26 వార్షిక కార్యాచరణలో భాగంగా క్లీన్ అండ్ గ్రీన్‌పై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు.

రేపు కల్యాణ మండపానికి శంకుస్థాపన

మార్టూరు, నవంబరు13 (ఆంధ్రజ్యోతి):మండలపరిధిలో అ మరావతి నూలుమిల్లు ఎదురుగా నాగార్పమ్మ దేవస్థానంలో శనివారం ఉదయం కల్యాణ మండప నిర్మాణానికి శంకుస్థాపన చేయనున్నట్లు కమిటీ సభ్యులు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు.


పరీక్ష రాస్తున్న విద్యార్థులు (ఫైల్)

'పది' పరీక్షల్లో విప్లవాత్మక మార్పులు

● నియామకాలన్నీ డీజీఈ కార్యాలయం నుంచే
● విద్యార్థుల హాల్‌టిక్కెట్లలో లొకేషన్ క్యూఆర్ కోడ్
● పరీక్షల నిర్వహణ కార్యాచరణ ప్రకటించిన డీజీఈ

ఒంగోలు విద్య, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): వచ్చే ఏడాది మార్చిలో జరగనున్న పదవ తరగతి పబ్లిక్ పరీక్షల్లో విప్లవాత్మక మార్పులు చోటుచేసుకోనున్నాయి. పరీక్షల నిర్వహణకు సంబంధించిన నియామకాలన్నింటిని కేంద్రీకృతం చేస్తున్నారు. అన్ని నియామకాలు ప్రభుత్వ పరీక్షల డైరెక్టర్ కార్యాలయం నుంచే జరగనున్నాయి. విద్యార్థులకు తమ పరీక్షా కేంద్రాలను సులువుగా తెలుసుకునేందుకు వారి హాల్‌టిక్కెట్లపైనే లొకేషన్ క్యూఆర్ కోడ్‌ను ముద్రించనున్నారు. పరీక్షల నిర్వహణకు సంబంధించిన కార్యాచరణను ప్రభుత్వ పరీక్షల డైరెక్టర్ కే వీశ్రీనివాసులురెడ్డి ప్రకటించారు. పదవ తరగతి పరీక్షల నిర్వహణకు సంబంధించి ఈసారి కేంద్రాల ఏర్పాటు నుంచే అన్ని ముందుజాగ్రత్తలు చేపడుతున్నారు. గతలో ఆయా విద్యా డివిజన్లకు సంబంధించి ఉప విద్యాశాఖాధికారులు సిఫార్సు చేసిన పాఠశాలలను పరీక్షా కేంద్రాలుగా నిర్ణయించేవారు. ప్రస్తుతం ఆ విధానాన్ని మార్చి ప్రభుత్వ పరీక్షల సహాయ కమిషనర్, ఉప విద్యాధికారి, జిల్లా విద్యాధికారి ఈ ముగ్గురు అధికారులు పాఠశాలలను, అక్కడి వసతులను పరిశీలించి ఒకే చేసిన పాఠశాలలనే కేంద్రాలుగా ఏర్పాటు చేయనున్నారు. ఆ పరీక్షా కేంద్రాల్లో పరీక్ష రాసే విద్యార్థులకు హాల్‌టిక్కెట్లపై లొకేషన్ క్యూఆర్ కోడ్ ముద్రించనున్నారు.

నియామకాలన్నీ అక్కడి నుంచే..

పరీక్షల నిర్వహణకు సంబంధించిన నియామకాలన్నింటిని కేంద్రీకృతం చేశారు. పరీక్షా కేంద్రాలకు చీఫ్ సూపరిటెండెంట్లు, డిపార్ట్‌మెంట్ అధికారులు, ఇన్విజిలేటర్ల నియామకాలన్నింటిని డీజీఈ కార్యాలయం నుంచే నియమించనున్నారు. గ్రేడ్-2 హెచ్‌ఎంలు, స్కూలు అసిస్టెంట్లు, సెకండరీ గ్రేడ్ టీచర్లు, ఇతరుల వివరాలన్నింటిని ఆన్‌లైన్‌లో తీసుకొని నియమించి జాబితాలను జిల్లాలకు పంపనున్నారు. ఈ విధానంతో పరీక్షల సిబ్బంది నియామకంలో పైరవీలకు కూడా ఫుల్‌స్టాప్ పడనుంది. జూనియర్ కళాశాలల్లో పదవ తరగతి పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేయవద్దని డీజీఈ ఆదేశించారు. ఇంటర్ విద్యా సంస్కరణల ఫలితంగా ఇంటర్ పరీక్షలు ఈ ఏడాది నెలరోజులకుపైగా జరగనున్నాయి. ఫిబ్రవరి చివరి వారం నుంచి మార్చి 24 వరకు ఇంటర్ పరీక్షలు జరగనున్న నేపథ్యంలో పరీక్షల నిర్వహణకు ఆటంకం కలగకుండా జూనియర్ కళాశాలల్లో పదవ తరగతి పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేయవద్దన్నారు. జిల్లాలో 10వ తరగతికి 180 పరీక్షా కేంద్రాలుండగా వాటిలో 14 కేంద్రాలు జూనియర్ కళాశాలల్లో ఉండటంతో వాటిని తప్పించి కేవలం పాఠశాలల్లో మాత్రమే కేంద్రాలను ఏర్పాటు చేయనున్నారు.

యూడైస్ నుంచే వివరాలు

పదవ తరగతి పబ్లిక్ పరీక్షలకు ఇప్పటి వరకు ఆచరణలో ఉన్న మాన్యువల్ నామినల్ రోల్(ఎంఎన్‌ఆర్)కు స్వస్తి పలికారు. ప్రతి పాఠశాలల్లో విద్యార్థుల పరీక్ష ఫీజు వివరాలతో పాటు మాన్యువల్ నామినల్ రోల్‌ను డీఈవో కార్యాలయంలో సమర్పించాల్సి ఉంది. అయితే ప్రస్తుతం ఆ పద్ధతికి స్వస్తి పలికారు. ప్రధానోపాధ్యాయులు విద్యార్థుల వివరాలను చేతితో రాసి సమర్పించే అవసరం లేకుండా సాంకేతికతను వినియోగించి విద్యార్థుల వివరాలను యూడైస్ నుంచి తీసుకొని డీజీఈ కార్యాలయమే నామినల్ రోల్‌ను తయారు చేస్తోంది. అందుకు సంబంధించి యుడైస్‌లోని విద్యార్థుల వివరాలను అప్‌లోడ్ చేయాలన్నారు. విద్యార్థులు, తల్లిదండ్రుల పేర్లు, వయస్సు, సబ్జెక్టు తదితర వివరాలను సరిచేసి పరీక్ష ఫీజు చెల్లించమన్నారు.

తల్లిని వేధించిన కుమారునిపై కేసు నమోదు

మార్టూరు,నవంబరు13(ఆంధ్రజ్యోతి):తనను అకారణంగా దూషిస్తూ,అసభ్యకరమైన మాటలు మాట్లాడుతూ భౌతికంగా దాడిచేశాడని పెద్దకుమారుడు నిదానం పోతురాజుపై తల్లి సుబ్బులు గురువారం స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఎస్ఐ సైదా కథనం మేరకు మండలంలోని జొన్నతాళి గ్రామానికి చెందిన సుబ్బులు అనే వృద్ధురాలికి గతంలోనే భర్త చనిపోగా,గ్రామంలో ఉన్న చిన్న కుమారుని దగ్గర ఉంటోంది. అదే గ్రామంలో ఉంటున్న పెద్ద కుమారుడు పోతురాజు తరచుగా తల్లి వద్దకు వచ్చి వివిధ రకాలుగా వేధిస్తున్నాడు.అందులో భాగంగా ఈ నెల 11 వతేదీ తల్లిని మాటలతో వేధించి, భౌతికంగా గాయపరచాడు.ఈ నేపథ్యంలో సుబ్బులు స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా,పోతురాజుపై కేసు నమోదు చేసి,దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ సైదా తెలిపారు.

ఇదే చివరి చాన్స్..!

అక్రమ కట్టడాల క్రమబద్ధీకరణకు మరో అవకాశం

బీపీఎస్ పునరుద్ధరిస్తూ ప్రభుత్వం జీవో జారీ

దరఖాస్తుకు 120 రోజుల గడువు

బిల్డర్లకు, భవన యజమానులకు ఊరట

భవన యజమానులకు శుభవార్త. బీపీఎస్ మళ్లీ వచ్చేసింది. అయితే ఇప్పటివరకు అనేక సార్లు గడువు పొడిగించిన ప్రభుత్వం ఈసారి మాత్రం ఇదే చివరి అవకాశం అని ప్రకటించింది. పట్టణ ప్రాంతాల్లో అక్రమ కట్టడాలను రెగ్యులరైజ్ చేయడం ద్వారా పురపాలికలు ఆర్థికంగా మరింత బలోపేతం అవుతాయని భావించిన టీడీపీ ప్రభుత్వం 2014-19లో ఈ పథకాన్ని అమలులోకి తీసుకొచ్చింది. పలుమార్లు గడువు పెంచుతూ అవకాశాన్ని కల్పించినా తక్కువమంది మాత్రమే వినియోగించుకున్నారు. 2019 తర్వాత అధికారంలోకి వచ్చిన వైసీపీ స్కీమ్‌ను నిలిపివేయడంతో మున్సిపాలిటీలు, కార్పొరేషన్‌లకు ఆదాయ వనరులు లేకుండాపోయాయి. అయితే ఎన్డీయే కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత మరోసారి బీపీఎస్‌ను పునరుద్ధరించింది. దీంతో ఇటు భవన యజమానులకు, అటు పురపాలక సంఘాలకు మరింత ప్రయోజనం చేకూరనుంది. పథకాన్ని సద్వినియోగం చేసుకుని క్రమబద్ధీకరణ చేసుకోవాలని, లేనిపక్షంలో ఆయా నిర్మాణాలను తొలగించనున్నట్లు పురపాలక శాఖ తెలిపింది.

ఒంగోలు కార్పొరేషన్, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): అక్రమ కట్టడాలను క్రమబద్ధీకరించుకునేందుకు రాష్ట్రప్రభుత్వం మరో అవకాశం కల్పించింది. బిల్డింగ్ పీనలైజేషన్ స్కీమ్ (బీపీఎస్)ను పునరుద్ధరిస్తూ జీవో ఎంఎస్. నెం.225ను బుధవారం జారీ చేసింది. జిల్లాలో వెయ్యికిపైగా అనధికార నిర్మాణాలు ఉన్నట్లు అంచనా. అయితే ఒక ఒంగోలులోనే 700లకుపైగా కార్పొరేషన్ అనుమతి లేకుండా, ప్లాన్ కూడా లేని నిర్మాణాలు ఉన్నాయి. మరోవైపు అత్యధికశాతం అపార్ట్‌మెంట్లకు ప్లానులు ఉన్నప్పటికీ అదనంగా నిర్మించే ఫ్లోర్లకు అనుమతులు లేవని అధికారులు గుర్తించారు. మార్కాపురం, కనిగిరి, గిద్దలూరు, పొదిలి, దర్శి, చీమకుర్తిలలో కలిపి మొత్తం మరో 300లకుపైగానే అక్రమ నిర్మాణాలు ఉన్నట్లు అంచనా. అయితే వాటిన్నింటినీ పూర్తిస్థాయిలో బీపీఎస్‌కు కిందకు తీసుకొచ్చి క్రమబద్ధీకరించడం ద్వారా ఒక్క ఒంగోలులోనే రూ.100కోట్లు ఆదాయం వచ్చే అవకాశం ఉంది. ఇతర మున్సిపాలిటీలలో మరో రూ.50కోట్లు వరకు ఆదాయం రానుంది. అయితే గతంలో బీపీఎస్‌ను వినియోగించుకోకపోగా, మరోవైపు అనుమతి లేని నిర్మాణాలను కూల్చివేసేందుకు టౌన్ ప్లానింగ్ అధికారులు చర్యలు చేపట్టారు. దీంతో యజమానులు తమ భవనాలను క్రమబద్ధీకరించుకునేందుకు ఎదురుచూపులు చూస్తున్నారు.

దరఖాస్తు చేసుకోవడం ఇలా..

2025 ఆగస్టు 31లోపు నిర్మించిన ఇళ్లు, భవనాలు బిల్డింగ్ పీనలైజేషన్ స్కీమ్ (బీపీఎస్)లో క్రమబద్ధీకరించుకునేందుకు ప్రభుత్వం మార్గదర్శకాలు జారీచేసింది. అందులో ప్రకటన వెలువడిన తేదీ 12 నవంబరు 2025 నుంచి 120 రోజుల్లోగా డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ. బీపీఎస్.జీవోవీ.ఇన్ వెబ్‌సైట్‌లో ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి. లైసెన్స్ కలిగిన టెక్నికల్ పర్సన్‌లు (ఎల్‌టీపీ) ద్వారా ప్రాసెస్ చేయించాలి. దరఖాస్తుతోపాటు యాజమాన్య హక్కు పత్రాలు (రిజిస్టర్ దస్తావేజులు), సబ్‌రిజిస్ట్రార్ జారీచేసిన ఎన్‌కంబరెన్స్, మార్కెట్ విలువ సర్టిఫికెట్‌లు, బిల్డింగ్ ప్లాను, తేదీ కనిపించేలా, భవనం మొత్తం కనిపించేలా 2 లేటెస్ట్ ఫొటోలు పొందుపరచాలి. వాటితోపాటు నిబంధనలకు విరుద్ధంగా చేపట్టిన ప్రాంతం, అనుమతించిన ప్రాంతంలో చేపట్టిన నిర్మాణాల డ్రాయింగ్‌లు, అనుమతులు లేకుండా మొత్తం భవనం నిర్మిస్తే బిల్డింగ్ నిర్మించిన ఏరియా, సైట్‌ప్లాన్, ఇంటెమ్నిటీ బాండ్, రోడ్డు విస్తరణకు సమ్మతి పత్రం, లైసెన్సు కలిగిన స్ట్రక్చరల్ ఇంజనీర్‌తో నిర్మాణ స్థిరత్వ ధ్రువీకరణ పత్రం (స్ట్రక్చర్ స్టెబిలిటీ సర్టిఫికెట్) పొందుపరచాలి.

క్రమబద్ధీకరణకు రుసుము ఎలా చెల్లించాలి?

విస్తీర్ణం ఆధారంగా చదరపు అడుగుకు రూ.40 నుంచి రూ.400 వరకు పీనలైజేషన్ ఫీజులు విధిస్తారు. నిర్మాణంలో ఉల్లంఘనలపై రూ.20 వేల నుంచి రూ.80 వేల వరకు అపరాధ రుసుము ప్రాథమికంగా చెల్లించాలి. అనధికార అంతస్తులకు చదరపు అడుగుకు రూ.120 నుంచి రూ.200 వరకు చెల్లించాలి. అయితే 60 గజాల్లోపు ఇంటి నిర్మాణాలకు (జీ+1)కు బీపీఎస్ స్కీమ్ అవసరం లేదు. అలాగే 1997 డిసెంబరు 31 నాటికి ముందు చేపట్టిన నిర్మాణాలపై మొత్తం పీనలైజేషన్ రుసుములో 25% రాయితీ ఉంటుంది. నోటిఫైడ్ మురికివాడల్లో నివాస భవనాలపై 50% రాయితీ ఉంటుంది. ఈ స్కీమ్ కార్పొరేషన్‌లు, మునిసిపాలిటీలు, నగరపంచాయతీలతోపాటు, ఒంగోలు అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ పరిధిలోని గ్రామపంచాయతీలలో వర్తిస్తుంది.


ఒంగోలు నగరం వ్యూ

బీపీఎస్ వీటికి వర్తించదు

ప్రభుత్వ భూముల్లో చేపట్టిన నిర్మాణాలకు, అలాగే వివాదాస్పద, యాజమాన్య హక్కు లేని భూముల్లో నిర్మించిన నిర్మాణాలకు, అర్బన్ ల్యాండింగ్ సీలింగ్, చెరువులు, వాగులు, కాలువలు ఆక్రమించి కట్టినవి, తీరప్రాంత నియంత్రణ మండలి నిబంధనలకు విరుద్ధంగా చేపట్టినవి, అనుమతి పొందిన లేఅవుట్‌లలోని పార్కింగ్, ఓపెన్ స్పేస్, వినోద ప్రదేశాలలో చేపట్టిన నిర్మాణాలకు, 2025 ఆగస్టు 13 తర్వాత నిర్మించిన భవనాలకు ఈ బీపీఎస్ వర్తించదు.

బీపీఎస్ నిధులు స్థానిక సంస్థలకే..

అక్రమ కట్టడాల క్రమబద్ధీకరణ ద్వారా వచ్చే నగదు మొత్తాలను ఆయా స్థానిక సంస్థలకే ఖర్చుచేసుకునే వెసులుబాటును ప్రభుత్వం కల్పించింది. అన్న క్యాంటిన్‌లు, సీవరేజ్ ట్రీట్‌మెంట్ ప్లాంట్, లెగసీ వ్యర్థాలు, స్టోమ్ వాటర్ డ్రెయిన్‌లు, రోడ్లు, ఇతర ప్రాధాన్యత పనులకు వాడుకోవాలని సూచించింది. కొత్త మాస్టర్ ప్లాన్ ప్రకారం రోడ్లు, లింక్ రోడ్‌లు, చెరువులు, రిక్రియేషన్ క్లబ్‌లు, ఓపెన్ లేఅవుట్‌ల పరిరక్షణకు వాడుకోవాలని పురపాలక శాఖ ఆదేశించింది.

ప్రకాశంలో జ్వరాల విజృంభణ

ఇటీవల వర్షాల తర్వాత జ్వరం, ఒళ్లునొప్పులు ప్రారంభం

అధికారికంగా పదిరోజుల్లో 6,998 మంది పీడితులు

అనధికారికంగా రెట్టింపు స్థాయిలోనే బాధితులు

ఒంగోలు కలెక్టరేట్, నవంబరు 13(ఆంధ్రజ్యోతి): జిల్లాలో సీజనల్ వ్యాధులు చాపకింద నీరులా వ్యాపిస్తున్నాయి. ఇటీవల కురిసిన భారీవర్షాలకు గ్రామాలు చుట్టుముట్టడంతో బురదమయంగా మారి దోమల ఉత్పత్తి పెరిగి ప్రజానీకం వ్యాధుల బారినపడుతున్నారు. జిల్లాలో 38 మండలాలు ఉండగా అన్నిచోట్ల ఏదో ఒకస్థాయిలో జ్వరపీడితులు ఉంటున్నారు. ఒంగోలు, మార్కాపురం, చీమకుర్తి, కనిగిరి, పామూరు, గిద్దలూరు, దర్శి, పొదిలిలో జ్వరపీడితులు మరింత ఎక్కువగా ఉన్నారు. అనేక ప్రాంతాల్లో తాగునీరు కూడా కలుషితం కావడం, ఇళ్ల చుట్టూ మురుగునీరు చేరడంతో ప్రజలు ఎక్కువగా కాళ్లనొప్పులు, ఒళ్లనొప్పుల బారిన పడుతున్నారు. జిల్లాలో అధికారికంగా ఈనెల 3వతేదీ నుంచి ఇప్పటివరకు 6,898 జ్వరపీడిత కేసులు నమోదు కాగా అనధికారికంగా రెండు, మూడు రెట్లు అధికంగా ఉంటుందని తెలుస్తోంది. ఈ పరిస్థితి ఒంగోలులో మరింత అధికంగా ఉంది. ఇటీవల కురిసిన భారీవర్షాలకు సుమారు 30 కాలనీలకుపైగా నీటమునగ్గా అనేక ప్రాంతాల్లో ఇప్పటికి నీరు నిల్వ ఉంది. నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో ఆ నీటిని బయటకు పంపినా ఇంకా ఖాళీస్థలాల్లో ఆ నీరు నిల్వ ఉండి దుర్వాసన రావడంతోపాటు దోమల ఉత్పత్తి కూడా గణనీయంగా పెరిగింది. దీంతో ప్రజలు దోమకాటుతో కొద్దిపాటి జ్వరాలతో ఆర్‌ఎంపీలు, పీఎంల వద్ద ప్రథమచికిత్స పొందిన అనంతరం ప్రభుత్వ వైద్యశాలలకు పరుగులు తీస్తున్నారు.


పోతవరంలో పిల్లలకు జ్వరపరీక్షలు చేస్తున్న డాక్టర్

పీహెచ్‌సీలలో భారీగా రోగులు

సాధారణ వ్యాధులతోపాటు చికున్‌గున్యా, మలేరియా, డెంగ్యూ వంటి కేసులు కూడా అక్కడక్కడ నమోదవుతున్నా వెలుగులోకి రావడం లేదు. ప్రతి పీహెచ్‌సీకి ప్రతిరోజు పది నుంచి 20 మంది వరకు జ్వరపీడితులు వస్తున్నట్లు సమాచారం. సీజనల్ వ్యాధుల పట్ల క్షేత్రస్థాయిలో ప్రజలకు అవగాహన లేకపోవడం, ప్రస్తుత సీజన్‌లో ప్రజలు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై విస్తృత ప్రచారం లేకపోవడంతో ప్రజలు ఈ వ్యాధుల బారిన పడుతున్నారు. గత నాలుగైదు రోజుల నుంచి ఉష్ణోగ్రతలు గణనీయంగా తగ్గిపోవడంతో చలి వాతావరణం నెలకొనడంతో ప్రజలు దగ్గు, దుమ్ములు, జలుబు వంటి వ్యాధుల బారిన కూడా పడుతున్నారు. ఆ పరిస్థితి జిల్లావ్యాప్తంగా ఉంది. ఒంగోలులో ప్రభుత్వ వైద్యశాలల్లో ఈ పదిరోజుల వ్యవధిలోనే 693 జ్వరం కేసులు నమోదయ్యాయంటే పరిస్థితి ఏ విధంగా ఉందో అర్థం చేసుకోవచ్చు. మార్కాపురం 395, చీమకుర్తి 375, కనిగిరి 374, పామూరు 248, గిద్దలూరు 239, దర్శి 233, పొదిలి 223, త్రిపురాంతకం 223, నాగులుప్పలపాడు 202 జ్వరపీడిత కేసులు నమోదయ్యాయి. జరుగుమల్లి మండలంలో 58 కేసులు నమోదు కాగా మిగిలిన మండలాల్లో వంద నుంచి 200లోపు కేసులు నమోదయ్యాయి.

'బర్లీ' బకాయిలు.. రూ.38 కోట్లు

(5వ పేజీ తరువాయి)

ఖాతాల్లో జమ చేశామని మార్క్‌ఫెడ్ అధికారులు చెప్తున్నారు. అయితే క్షేత్రస్థాయిలో పలు గ్రామాల్లోని రైతులు మాత్రం ఇంకా తమ ఖాతాల్లో డబ్బులు జమ కాలేదని చెప్తున్నారు. బర్లీ పొగాకు కొనుగోళ్లు ప్రారంభమైన మొదటి వారంలోనే తమ ఉత్పత్తులను అమ్ముకున్న రైతులకు సైతం ఇంకా డబ్బులు జమ కాలేదని తెలుస్తోంది. దాదాపు నాలుగు నెలలుగా బకాయిలు జమ కోసం రైతులు ఎదురుచూస్తున్నారు. బర్లీ బకాయిల డబ్బుల వ్యథ ఇలా ఉంటే మొంథా తుఫాన్ రూపంలో నిల్వ ఉంచిన బేళ్లను మరింత దెబ్బతీసింది. మొంథా మిగిల్చిన నష్టాలకు సంబంధించి అన్ని పంటల గణన జరిగినప్పటికీ సాంకేతిక అంశాలతో ఆ జాబితాలో బర్లీ పొగాకు పేరు లేదు. దీంతో సాగుదారులు నీరుగారిపోయారు. ఇదే విషయాన్ని రైతులు తాజాగా కారంచేడులో పర్యటించిన కేంద్ర బృందం దృష్టికి కూడా తీసుకెళ్లారు.

రైతుల వద్ద ఇంకా 50 వేల క్వింటాళ్లు

క్షేత్రస్థాయిలో నాలుగు జిల్లాల పరిధిలోని రైతుల వద్ద ఇంకా 50,000 క్వింటాళ్ల బర్లీ నిల్వలు ఉంటాయనేది అంచనా. కాగా మంత్రులు, ఎమ్మెల్యేలను కూడా రైతులు కలిసి పొగాకు కొనుగోళ్లపై అభ్యర్థించారు. ఈ క్రమంలో 20,000 క్వింటాళ్ల అదనపు బర్లీ కొనుగోళ్లపై జిల్లా అధికారులు మార్క్‌ఫెడ్‌కు పంపిన ప్రతిపాదనలపై ఇప్పటికీ కదలిక లేదు. రోజులు గడుస్తున్నాయే కానీ అదనపు కొనుగోళ్లపై మార్క్‌ఫెడ్ నుంచి స్పందన లేకపోవడంతో ఆశలు వదులుకోవడమే మేలనే అభిప్రాయానికి దాదాపు రైతులు వచ్చారు. ఇందులో దాదాపు 10,000 క్వింటాళ్ల వరకు మొంథా తుఫాన్ దెబ్బకి పూర్తిగా నాణ్యత దెబ్బతిని లోగ్రేడ్ రకంలో చేరిపోయింది. అటు అదనపు కొనుగోళ్లు లేక, ఇటు మొంథా నష్ట పరిహార జాబితాలో తమకు చోటు దక్కక, బకాయిలకు నెలల తరబడి ఎదురుచూడాల్సిన పరిస్థితి బర్లీ రైతాంగానిది.

తుఫాన్ ప్రభావిత ప్రాంతాల్లో పరిస్థితులు చక్కదిద్దాలి

● ఎమ్మెల్యే దామచర్ల

ఒంగోలు కార్పొరేషన్/ఒంగోలు క్రైం, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): మొంథా తుఫాన్ కారణంగా ముంపునకు గురైన కాలనీల్లో పరిస్థితులు చక్కదిద్దాలని ఎమ్మెల్యే దామచర్ల జనార్దర్ కార్పొరేషన్ అధికారులను ఆదేశించారు. వర్షం నీరు నిల్వ లేకుండా, వ్యాధులు సంక్రమించకుండా తగిన చర్యలు తీసుకోవాలన్నారు. గురువారం నగరంలోని సుజాతనగర్, లంబాడీడొంకలో ఆయన పర్యటించారు. ఇటీవల కురిసిన తుఫాను కారణంగా పలు డ్రైన్‌లు దెబ్బతినడంతోపాటు, పలు కాలనీల్లో ఇంకా వర్షం నీరు నిల్వ ఉండటాన్ని ఎమ్మెల్యే పరిశీలించారు. మురుగునీరు నిల్వ లేకుండా, అలాగే ప్రజలకు ఇబ్బందులు లేకుండా తగిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.


పీటీసీ పరిసరాలను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే జనార్దన్, ప్రిన్సిపాల్ రాధిక, కమిషనర్ వెంకటేశ్వరరావు

పోలీసు శిక్షణ కళాశాల పరిశీలన

తుఫాన్ వల్ల వరద ప్రభావానికి గురైన పోలీసు శిక్షణ కళాశాలను ఎమ్మెల్యే దామచర్ల పరిశీలించారు. ఆయా ప్రాంతాలలో వరద నీరు చేరడానికి గల కారణాలు, నివారణ చర్యలపై చర్చించారు. ఈ సందర్భంగా పోలీసు శిక్షణ కళాశాల ప్రిన్సిపాల్ రాధిక, కమిషనర్ వెంకటేశ్వరరావులతో ఎమ్మెల్యే మాట్లాడారు. పీటీసీలో మురుగు నీరు నిల్వ లేకుండా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. కార్యక్రమంలో పలువురు అధికారులు పాల్గొన్నారు.

చార్మినార్ ఎక్స్‌ప్రెస్‌లో భారీ చోరీ

● 50 సవర్ల బంగారు ఆభరణాల అపహరణ

ఒంగోలు క్రైం, నవంబరు 13(ఆంధ్రజ్యోతి): చార్మినార్ ఎక్స్‌ప్రెస్ రైలులో భారీ చోరీ జరిగింది. గురువారం ఈమేరకు బాధితులు రైల్వే పోలీసులకు సమాచారం ఇచ్చారు. హైదరాబాద్ నుంచి నెల్లూరుకు చెందిన భార్యభర్తలు బుధవారం రాత్రి చార్మినార్ ఎక్స్‌ప్రెస్‌లో టూటైర్ ఏసీ బోగిలో బయలుదేరారు. గురువారం ఉదయం కావలి-ఒంగోలు మధ్యలో వారి వద్ద బంగారు ఆభరణాలు ఉన్న బ్యాగ్ కనిపించ లేదు. అందులో సుమారు 50 సవర్లు (సుమారు రూ.50లక్షలు) బంగారం ఆభరణాలు అపహరణకు గురైనట్లు గుర్తించి వెంటనే రైల్వే పోలీసులకు సమాచారం ఇచ్చారు. దీంతో అప్రమత్తమైన నెల్లూరు రైల్వే డీఎస్పీ మురళీధర్ ఒంగోలు రైల్వే పోలీస్‌స్టేషన్‌లో మకాం వేసి విచారణ చేపట్టారు. అయితే ఇంకా కేసు నమోదు చేయలేదు. కావలి రైల్వే పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదు చేసే అవకాశం ఉందని రైల్వే పోలీసులు చెబుతున్నారు. బాధితులు గురువారం నెల్లూరు వెళ్ళి అక్కడ నుంచి తిరిగి హైదరాబాద్‌కు వెళ్ళినట్లు తెలిసింది. వారు ఇచ్చే ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసే అవకాశం ఉంది.



దర్శి నేతలతో ప్రమాణస్వీకారం చేయిస్తున్న ఇన్‌చార్జి గొట్టిపాటి లక్ష్మి

కోలాహలంగా ప్రమాణ స్వీకారాలు

ఒకేసారి వందలాది మంది, వివిధ స్థాయిల్లో నూతన నాయకత్వం

నియోజకవర్గం యూనిట్‌గా ఇప్పటికే పలుచోట్ల పూర్తి

నేడు ఒంగోలు, రేపు మార్కాపురంలో..

సంస్థాగతంపై అధిష్ఠానం దృష్టి

ఒంగోలు, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): పార్టీ సంస్థాగత నిర్మాణంపై అధిష్ఠానం ప్రత్యేక దృష్టిసారించడంతో జిల్లాలో పార్టీ ఆదేశాలతో టీడీపీ వివిధ స్థాయిల్లోని బాధ్యులు ప్రమాణ స్వీకారోత్సవాలు జరుగుతున్నాయి. నియోజకవర్గం యూనిట్‌గా ఒకే విడత వందలాది మంది నూతన నాయకులు పదవుల బాధ్యతలు స్వీకరిస్తున్నారు. రెండు రోజులుగా జిల్లా అంతటా కోలాహలంగా ఈ కార్యక్రమాలు జరుగుతున్నాయి. కడప మహానాడు నుంచి టీడీపీ అధిష్ఠానం గ్రామ, బూత్ స్థాయి నుంచి పార్టీ సంస్థాగత నిర్మాణంపై ప్రత్యేక దృష్టి సారించిన విషయం విదితమే. క్షేత్రస్థాయిలోని బూత్, యూనిట్, క్లస్టర్ కన్వీనర్‌ల వ్యవస్థను పటిష్ఠం చేయడంతోపాటు మండల, గ్రామ కమిటీలు, అనుబంధ విభాగాలకు కమిటీల నియామకంలో మార్పులు చేశారు. గతంలో వరుసగా మూడుసార్లు ఆ బాధ్యతలతో పనిచేసిన వారిని తప్పించి కొత్తవారికి అవకాశంతోపాటు సామాజికవర్గాల సమతుల్యంను పాటిస్తూ నూతన కమిటీలను పొందుపర్చారు. తద్వారా వివిధ స్థాయిల్లో చాలాచోట్ల అత్యధికులు కొత్త వారు బాధ్యతల్లోకి రాగా పదవీ స్వీకరణ కూడా అధిష్ఠానం నిర్దిష్ట నమూనాలో నిర్వహించాలని ఆదేశించింది.

సామూహికంగా.. పండగలా..

నియోజకవర్గం యూనిట్‌గా ఆ నియోజకవర్గ ఎమ్మెల్యే లేదా ఇన్‌చార్జి పర్యవేక్షణలో ఆ పరిధిలోని బూత్ స్థాయి నుంచి మండల లేదా పట్టణ అధ్యక్షుల వరకు ఒకేసారి, ఒకేచోట సామూహికంగా ప్రమాణ స్వీకారం చేసేలా ఏర్పాటు చేశారు. తదనుగుణంగా రెండురోజుల నుంచి నియోజకవర్గాల వారీ కార్యక్రమాలు జరుగుతుండగా అవి వందలాది మంది పార్టీ శ్రేణులతో కోలాహలంగా సాగుతున్నాయి. జిల్లాలో తొలుత ఈనెల 11న ఎస్‌ఎన్‌పాడు నియోజకవర్గ కార్యక్రమం ఎమ్మెల్యే బీఎన్.విజయకుమార్ నేతృత్వంలో ఒంగోలులో జరగ్గా 12న కొండపిలో మారిటైం బోర్డు చైర్మన్ దామచర్ల సత్య నేతృత్వంలో జరిగింది. అలాగే గురువారం ఎమ్మెల్యే డాక్టర్ ముక్కు ఉగ్రనరసింహారెడ్డి నేతృత్వంలో కనిగిరి, ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డి నేతృత్వంలో గిద్దలూరు, టీడీపీ ఇన్‌చార్జి ఎరిక్షన్‌బాబు ఆధ్వర్యంలో వైపాలెం నియోజకవర్గంలో, టీడీపీ దర్శి ఇన్‌చార్జి డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి ఆధ్వర్యంలో దర్శి నియోజకవర్గ ప్రమాణస్వీకారోత్సవాలు జరిగాయి. ఇక మిగిలిన వాటిలో చూస్తే ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్ నేతృత్వంలో 14వతేదీన ఒంగోలులో, అలాగే ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి నేతృత్వంలో మార్కాపురం నియోజకవర్గ ప్రమాణస్వీకార కార్యక్రమం 15వతేదీన జరగనుంది.


మేదరమెట్లలో ప్రమాణస్వీకారం చేస్తున్న కొరిశపాడు మండల టీడీపీ కమిటీ నేతలు

టీడీపీ కొరిశపాడు మండల కమిటీ ప్రమాణ స్వీకారం

మేదరమెట్ల, నవంబరు13(ఆంధ్రజ్యోతి): ఇటీవల నూతనంగా ఎన్నికైన తెలుగుదేశం పార్టీ కమిటీల ప్రమాణ స్వీకారం మేదరమెట్లలోని ఓ ప్రైవేట్ కల్యాణమండపంలో జరిగింది. గురువారం పార్టీ తరఫున పరిశీలకునిగా హాజరైన జి.తారకరామారావు ఆధ్వర్యంలో మండల, గ్రామ, క్లస్టర్, యూనిట్, బూత్ కమిటీల ప్రమాణస్వీకారాన్ని జరిపించారు. మండల పార్టీ అధ్యక్షుడిగా సింబోతు సత్యనారాయణ, ఉపాధ్యక్షునిగా మోపర్తి లక్ష్మీనారాయణ, కార్యదర్శిగా గండే హెస్కేల్‌తో పాటు చెన్నుపాటి హరిబాబు, మేదరమెట్ల శ్రీనివాసరావు, జాగర్లమూడి వీరాంజనేయులు, పిన్నక శ్రీధర్, మొరవనేని రాంబాబు, చింతం సుబ్బారావు, కరిచేటి రాంబాబు, విజయ్ తదితరులు ప్రమాణస్వీకారం కార్యక్రమంలో పాల్గొన్నారు. టీడీపీ అభివృద్ధికి నూతన కార్యవర్గం కృషిచేయాలని తారకరామారావు కోరారు. రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ నేతృత్వంలో పార్టీ అభివృద్ధికి కృషి చేస్తామని వారు తెలిపారు.

అవీ.. ఇవీ



పారిశుధ్య కార్మికురాలితో మాట్లాడుతున్న ప్రకాశం జడ్పీ సీఈవో చిరంజీవి

జడ్పీ సీఈవో విస్తృత పర్యటన

● ఎస్‌డబ్ల్యూపీసీ, పారిశుధ్య నిర్వహణ పరిశీలన

వేటపాలెం(చీరాల), నవంబరు 13 (ఆంధ్రజ్యోతి) : వేటపాలెం మండల పరిధిలో గురువారం జడ్పీ సీఈవో బి. చిరంజీవి విస్తృత పర్యటన చేశారు. ఈసందర్భంగా ఎంపీడీవో రాజేష్‌బాబుతో కలిసి కొత్తపేట పంచాయతీలో డీఎల్‌డీవో కార్యాలయాన్ని సందర్శించి పలు రికార్డులపై ఆరా తీశారు. అలాగే అక్కయ్యపాలెం ఎస్‌డబ్ల్యూపీసీ కేంద్రాన్ని తనిఖీ చేశారు. పారిశుధ్య కార్మికులతో మాట్లాడి చెత్తసేకరణపై వివరాలు సేకరించారు. మండల కార్యనిర్వహణకు సంబంధించి వివరాలను కమిషనరేట్‌కు అందించనున్నట్లు తెలిపారు. అలాగే ప్రజాభిప్రాయం కోసం ఐవీఆర్‌ఎస్ కాల్స్ వంటివి ఉంటాయని చెప్పారు. వారి వెంట సెక్రటరీలు వెంకటేశ్వర్లు, కట్టా రాణి తదితరులు ఉన్నారు.



బల్లికురవలో మూతపడిన గ్రంథాలయం

మూతపడిన బల్లికురవ గ్రంథాలయం

● కొంతకాలంగా గ్రంథపాలకుడు కరువు

● వారోత్సవాలు లేనట్లే

బల్లికురవ, నవంబరు13(ఆంధ్రజ్యోతి): బల్లికురవలో 1986 నుంచి ఉన్న గ్రంథాలయం నేడు గ్రంథపాలకుడు లేకపోవడంతో మూతపడింది. ప్రజలకు విజ్ఞానాన్ని అందించేందుకు గతంలో ఏర్పాటు చేసిన ఈ గ్రంథాలయం నెలల తరబడి మూత పడి ఉండటంతో పాఠకులు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. శుక్రవారం నుంచి ప్రభుత్వం అన్ని గ్రంథాలయాలలో వారోత్సవాలు నిర్వహించాలని ఆదేశాలు ఇచ్చింది. బల్లికురవ గ్రంథాలయంలో మాత్రం వారోత్సవాలు ఈ ఏడాది లేనట్లే అని పాఠకులు అంటున్నారు. రెండేళ్ల క్రితం ఇక్కడ పనిచేస్తున్న గ్రంథపాలకుడు ఉద్యోగవిరమణ చేయటంతో అప్పటి నుంచి కష్టాలు మొదలయ్యాయి. గ్రంథలయానికి సొంత భవనం ఉన్నందున వెంటనే గ్రంథపాలకుడిని నియమించాలని మండల ప్రజలు కోరుతున్నారు.

గ్రామాల్లో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొల్పడమే లక్ష్యం



వివరాలు వెల్లడిస్తున్న దామా నాగేశ్వరరావు

పర్చూరు, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి) : గ్రామాల్లో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొల్పడమే లక్ష్యంగా ప్రజా ప్రభుత్వం కృషి చేస్తుందని దేవదాయశాఖ అధికారి దామా నాగేశ్వరరావు అన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ కాలనీల్లో నూతన ఆలయాల నిర్మాణాలకు దరఖాస్తు ఆహ్వానంపై ఆయన గురువారం స్థానిక కార్యాలయంలో వివరాలు వెల్లడించారు. గ్రామాల్లోని ప్రతి కాలనీలో నూతన ఆలయాలు నిర్మించుకునేందుకు ప్రభుత్వం ఒక్కో ఆలయానికి రూ.10 నుంచి 20 లక్షల వరకు ఆర్థిక సహాయం అందజేస్తుందన్నారు. అలాగే శాసన సభ్యుడు ఏలూరి సాంబశివరావు ప్రత్యేక దృష్టితో పెద్ద ఎత్తున ఆయా కాలనీల్లో ఆలయాలు నిర్మించుకునే విధంగా ప్రజలకు అవగాహన కల్పించాలని తమకు ఆదేశాలు జారీచేశారన్నారు.

మంత్రి రవికుమార్ ఆదేశాలతో యుద్ధప్రాతిపదికన రహదారి పనులు

తాత్కాలిక మరమ్మతులతో రాకపోకలు పునరుద్ధరణ

అద్దంకి,నవంబరు13(ఆంధ్రజ్యోతి): మొంథా తుఫాన్ ప్రభావంతో అద్దంకి మండలంలో రెండు వాగులు ఉధృతంగా ప్రవహించి తిమ్మాయపాలెం-ఇలపావులూరు ఆర్ అండ్‌బీ రోడ్డులో బ్రిడ్జి, రోడ్డు కొట్టుకుపోయాయి. దీంతో అద్దంకితో మూడు గ్రామాలకు పూర్తిగా రాకపోకలు నిలిచిపోయాయి. ఈ నేపథ్యంలో విద్యుత్‌శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ పరిశీలన చేసి వెంటనే తాత్కాలిక మరమ్మతులు చేపట్టి రాకపోకలు పునరుద్ధరించాలని ఆర్ అండ్‌బీ అధికారులను ఆదేశించారు. యుద్ధప్రాతిపదికన మరమ్మతులు చేపట్టి గురువారానికి రాకపోకలు పూర్తి స్థాయిలో పునరుద్ధరించారు. ప్రధానంగా పేరాయపాలెం సమీపంలో దోర్నపువాగుపై బ్రిడ్జితో పాటు రోడ్డు కూడా కోసుకుపోయింది. అదే సమయంలో మోదేపల్లి వద్ద చిలకలేరు వాగుపై రోడ్డు కోసుకుపోయింది. తొలుత మోదేపల్లి వద్ద రోడ్డుకు పడ్డ గండికి పైప్‌కల్వర్టులు ఏర్పాటు చేసి రోడ్డు పోశారు. పేరాయపాలెం వద్ద దోర్నపువాగుపై బ్రిడ్జి కొట్టుకుపోగా, పాత బ్రిడ్జికి తాత్కాలిక మరమ్మతులు, రోడ్డుకు పడ్డ భారీ గండిని కూడా పూడ్చారు. గురువారం నాటికి పనులు పూర్తి కావటంతో రాకపోకలు పునరుద్ధరణ జరిగాయని మోదేపల్లి టీడీపీ నేత నర్రా వీరయ్య తెలిపారు. దీంతో మండలంలోని పేరాయపాలెం, ఉమ్మనేని వారిపాలెం, ధేనువకొండ గ్రామాలకు అద్దంకి వచ్చేందుకు రాకపోకలు ప్రారంభం అయ్యాయి. అద్దంకి నుంచి తాళ్లూరు, గంగవరం నడిచే బస్ సర్వీసులు పునరుద్ధరణకు అవకాశం ఏర్పడింది.



మోదేపల్లి వద్ద చిలకలేరుపై పూర్తయిన పైప్‌కల్వర్టు పనులు



పేరాయపాలెం వద్ద మరమ్మతులు పూర్తయిన తరువాత దోర్నపువాగు వద్ద రోడ్డు

పేదవాడి చెమట నుంచి పుట్టిందే టీడీపీ

నియోజకవర్గ పరిశీలకుడు పఠాన్ సమీమ్‌ఖాన్

అద్దంకి,నవంబరు13(ఆంధ్రజ్యోతి):పేద వాడి చెమట నుంచి పుట్టిన పార్టీ తెలుగుదేశం అని నియోజకవర్గ పరిశీలకుడు పఠాన్ సమీమ్‌ఖాన్ అన్నారు. గురువారం అద్దంకి పట్టణంలోని టీడీపీ కార్యాలయంలో అద్దంకి మండల, పట్టణ కమిటీలతో పఠాన్ సమీమ్‌ఖాన్ ప్రమాణం చేయించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రతి కార్యకర్త పార్టీకి వెన్నుముక లాంటి వారన్నారు. కష్టపడ్డ ప్రతి కార్యకర్తకు ఖచ్చితంగా గుర్తింపు దక్కుతుందన్నారు. మండల పార్టీ అధ్యక్షుడిగా మానం మురళీమోహన్‌దాస్, ఉపాధ్యక్షుడిగా గాలం శ్రీనివాసరావు, ప్రధానకార్యదర్శిగా గోగులమూడి రాజశేఖర్, అద్దంకి పట్టణ అధ్యక్షుడుగా అరిగల నాగరాజు,ఉపాధ్యక్షుడిగా దొప్పలపూడి ప్రసాద్, ప్రధానకార్యదర్శిగా యనగండ్ల శ్రీనివాసరావులతో పాటు కార్యవర్గ సభ్యులు ప్రమాణ స్వీకారం చేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నేతలు నాగినేని రామకృష్ణ, చిన్ని శ్రీనివాసరావు, కుందారపు రామారావు, కాకాని అశోక్,ముండూరి మురళీసుధాకర్, కఠారి నాగేశ్వరరావు, బండారుపల్లి శ్రీనివాసరావు, లహరి,పెంట్యాల రామాంజనేయులు, వడ్డవల్లి పూర్ణచంద్రరావు తదితరులు పాల్గొన్నారు.



అద్దంకి మండల టీడీపీ కమిటీ చేత ప్రమాణం చేయిస్తున్న నియోజకవర్గ పరిశీలకులు పఠాన్ షమీమ్ ఖాన్



మండల కమిటీతో ప్రమాణ స్వీకారం చేయిస్తున్న టీడీపీ పరిశీలకుడు ప్రసాద్

బల్లికురవలో టీడీపీ మండల, గ్రామ కమిటీల ప్రమాణ స్వీకారం

బల్లికురవ, : మండల తెలుగుదేశం పార్టీ నూతన కమిటీలతో పాటు గ్రామ కమిటీల ప్రమాణ స్వీకార కార్యక్రమం గురువారం బల్లికురవలో అంగరంగ వైభవంగా జరిగింది. పార్టీ కార్యాలయం నుంచి వచ్చిన మండల పరిశీలకులు మన్నం ప్రసాద్ నూతన కమిటీలతో ప్రమాణం చేయించారు. ముందుగా నాలుగు రోడ్ల కూడలిలో ఉన్న పార్టీ వ్యవస్థాపక అధ్యక్షుడు, దివంగత ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి ర్యాలీగా పార్టీ కార్యాలయానికి నేతలు చేరారు. అనంతరం నూతన మండల పార్టీ అధ్యక్ష కార్యదర్శులుగా దూళిపాళ్ల హనుమంతురావు, కత్తి ఆశోకబాబు, ఉపాధ్యక్షుడు యోహోన్‌లతో పాటు అన్ని గ్రామాల కమిటీలు ప్రమాణస్వీకారం చేశారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ వైస్ ఛైర్మన్ దేవినేని నరేంద్ర, సొసైటీ అధ్యక్షుడు గొట్టిపాటి లక్ష్మయ్య, మాలపాటి వెంకటసుబ్బయ్య, మామిళ్లపల్లి ప్రవీణ్‌కుమార్, డీసీ వైస్ ఛైర్మన్ కోయ పేరయ్య, నేతలు పాల్గొన్నారు.

గోదాములను పరిశీలించిన ఐసీడీఎస్ పీడీ

● పాడైన సరుకులే పారబోసినట్లు నిర్ధారణ

ఇంకొల్లు, నవంబరు 13,(ఆంధ్రజ్యోతి): ఇంకొల్లు సమీపంలో బుధవారం రోడ్డు పక్కన పడవేసిన చిక్కీప్యాకెట్లు,కోడిగుడ్లుపై ప్రచురించిన కథనానికి జిల్లా మహిళా శిశుసంక్షేమ ప్రాజెక్టు డైరెక్టరు రాధామాధవి స్పందించారు. గురువారం ఇంకొల్లులో విచారణ చేపట్టారు.మండలంలోని తాటిపర్తివారిపాలెం గ్రామంలో ఉన్న ఐసీడీఎస్ స్టాక్ గోడౌనును ఆమె పరిశీలించారు.అంగన్‌వాడీ కేంద్రాలకు సరఫరా చేసిన రికార్డులను ఆమె పరిశీలించారు.కేంద్రాలకు సరఫరా సక్రమంగానే సరిగిందని నిర్ధారించారు. ఇంకొల్లు, చినగంజాం, కారంచేడు మండలాలలోని అంగన్‌వాడీ కేంద్రాలకు సరఫరా చేసే కాంట్రాక్టరు తాటిపర్తివారిపాలెంకు చెందిన బత్తుల శివారెడ్డిని విచారించారు. సరుకులు గడువు అయిపోయిన వాటిని పడవేసినట్లు తేల్చారు. ఈ తనిఖీలలో తహసీల్దారు శ్రీనివాస్,విద్యాశాఖాధికారి శ్రీనివాసరావు,ఐసీడీఎస్ సీడీపీవో సులోచనారాణి,సూపర్‌వైజర్లు లీలావతి,వాణి పాల్గొన్నారు.



గోడౌన్లను పరిశీలిస్తున్న ఐసీడీఎస్ పీడీ రాధామాధవి

తడి, పొడి చెత్తలను వేరువేరుగా సేకరించాలి

చినగంజాం, నవంబరు 13(ఆంధ్రజ్యోతి) : గ్రామాల్లో తడి, పొడి చెత్తలను వేరువేరుగా సేకరించాలని, గ్రామాల్లోని ప్రజలకు దీనిపై అవగాహన కల్పించాలని ఎంపీడీవో కె.ధనలక్ష్మి గ్రామ కార్యదర్శులకు సూచించారు. స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయ సమావేశపు హాల్‌లో పచ్చదనం, పరిశుభ్రత, ఆర్‌జీఎస్‌ఏ వార్షిక యాక్షన్ ప్లాన్ 2025-2026పై మండల పరిధిలోని గ్రామ సర్పంచ్‌లకు, కార్యదర్శులకు గురువారం జరిగిన శిక్షణలో ఆమె పాల్గొని మాట్లాడారు. ప్రతి ఇంటి నుంచి చెత్త సేకరించు విషయంలో ప్రజలకు అవగాహన కల్పించాలని ఎంపీడీవో అన్నారు. గ్రామాలను పరిశుభ్రంగా ఉంచాలని అన్నారు. కార్యక్రమంలో మండల పరిషత్ కార్యాలయ పరిపాలనాధికారి సీ.హెచ్.పూర్ణచంద్రరావు, పంచాయతీ రాజ్ ఏఈ డి.దాసు, ఇన్‌చార్జ్ డిప్యూటీ ఎంపీడీవో కే.అంజయ్య, చినగంజాం గ్రామ సర్పంచ్ రాయని ఆత్మారావు, సంతరావూరు ఉపసర్పంచ్ మేడ నరసింహారావు,కడవకుదురు కార్యదర్శి పి.శ్రీనివాసరావు, మండల పరిధిలోని గ్రామ సర్పంచ్‌లు, కార్యదర్శులు పాల్గొన్నారు.



శిక్షణలో మాట్లాడుతున్న ఎంపీడీవో ధనలక్ష్మి

గ్రంథాలయ వారోత్సవాలను విజయవంతం చేయాలి

అద్దంకి,నవంబరు13(ఆంధ్రజ్యోతి):గ్రంథాలయ వారోత్సవాలను విజయవంతం చేయాలని ఆశాఖ అధికారిణి వసుంధరాదేవి అన్నారు. స్థానిక బంగ్లా రోడ్డులో ఉన్న గ్రంథాలయం లో గురువారం వారోత్సవాల బ్రోచర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా పలువురు వక్తలు మాట్లాడుతూ అద్దంకిలో 70 సంవత్సరాలుగా గ్రంథాలయం అద్దె భవనంలో నడుస్తుందని, ప్రస్తుతం మంత్రి రవికుమార్ ప్రత్యేక చొరవ తో భవన నిర్మాణం ప్రారంభమైనందున వేగవంతంగా పూర్తి చేయాలని అన్నారు.ఈ కార్యక్రమంలో పురావస్తు పరిశోధకుడు జ్యోతి చంద్రమౌళి, మన్నం త్రిమూర్తులు, సుగుణరావు, అలహరి హరిబాబు, తాళ్లూరి బాబురావు తదితరులు పాల్గొన్నారు.



గ్రంథాలయ వారోత్సవాల బ్రోచర్‌ను ఆవిష్కరిస్తున్న సాహితీ సంస్థల ప్రతినిధులు

కరపత్రాల ఆవిష్కరణ

అద్దంకి,నవంబరు13(ఆంధ్రజ్యోతి):ఏపీ మున్సిపల్ వర్కర్స్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ రాష్ట్ర 15 వ మహాసభలు ఈనెల 15,16 తేదీలలో ఒంగోలులో జరగనున్న నేపథ్యంలో విజయవంతం చేయాలని సీఐటీయూ మండల కార్యదర్శి తంగిరాల వెంకటేశ్వర్లు అన్నారు. ఈ సందర్భంగా కరపత్రాలను బుధవారం ఆవిష్కరించారు. ఈ కార్య క్రమంలో మున్సిపల్ వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు ఆదాం, ఉసురుపాటి శామ్యూల్,దాసరి వీరయ్య, మున్నంగి కోటేశ్వరరావు,ప్రేమ్ తదితరులు పాల్గొన్నారు.

నేడు మండల సర్వసభ్య సమావేశం

మార్టూరు,నవంబరు13(ఆంధ్రజ్యోతి): మండల సర్వసభ్య సమావేశం ఎంపీడీవో కార్యాలయంలో శుక్రవారం ఉదయం 11 గంటలకు నిర్వహించనున్నట్లు ఎంపీడీవో వై. శ్రీనివాసరావు గురువారం ఓ ప్రకటనలో తెలిపారు.

పరీక్షా కేంద్రాల పరిశీలన

పంగులూరు, నవంబరు 13(ఆంధ్రజ్యోతి): మండలంలోని పదోతరగతి పరీక్షా కేంద్రాలను పరీక్షల విభాగం అసిస్టెంట్ కమిషనర్ శివకుమార్ గురువారం పరిశీలించారు. పంగులూరు, ముప్పవరం పరీక్షా కేంద్రాలను సందర్శించిన శివకుమార్ పరీక్షలనిర్వహణకు పాఠశాలల్లో ఉన్న సౌకర్యాలు, మౌలిక వసతులు పరిశీలించారు. వీరివెంట ఎంఈవో వీరాంజనేయులు, హెచ్‌ఎంలు సోమేపల్లి శ్రీనివాసరావు, పుచ్చకాయల ప్రసాద్ పాల్గొన్నారు.

మార్టూరులో..

మార్టూరు :మండలంలోని వలపర్ల జడ్పీ హైస్కూల్‌ను గురువారం బాపట్ల పరీక్షల అసిస్టెంట్ కమిషనర్ కె. శివకుమార్ పరిశీలించారు. 10 వతరగతి పరీక్షలకు సంబంధించి స్కూల్‌లోని వసతులు, ఇన్విజిలేటర్లు గురించి వివరాలు అడిగి తెలుసుకున్నారు.

నేడు టీడీపీ మండల, గ్రామ కమిటీల ప్రమాణ స్వీకారం

పంగులూరు, నవంబరు 13(ఆంధ్రజ్యోతి):జె. పంగులూరు మండల, గ్రామ టీడీపీ కమిటీలు, క్లస్టర్ యూనిట్ల ప్రతినిధుల ప్రమాణస్వీకారం శుక్రవారం ఉదయం 9గంటలకు ముప్పవరం పార్టీ కార్యాలయంలో జరుగుతుందని టీడీపీ మండల అధ్యక్షుడు రావూరి రమేష్ తెలిపారు

పురుగు మందు తాగి మహిళ ఆత్మహతాయత్నం

బల్లికురవ, నవంబరు13(ఆంధ్రజ్యోతి): మండలంలోని అంబడిపూడి గ్రామానికి చెందిన వివాహిత కోపూరి సునీత కుటుంబ కలహాల నేపథ్యంలో గురువారం ఎలుకల మందు తాగి అత్మహత్యాయత్నంకు పాల్పడింది. కుటుంబ సభ్యులు ఈవిషయాన్ని గమనించి వెంటనే 108లో వైద్య కోసం అద్దంకి ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. అక్కడ మహిళ అరోగ్యం విషమంగా ఉండటంతో ఒంగోలు రిమ్స్‌కు తరలించారు.

వీఆర్‌ఏ కోటేశ్వరరావు మృతి

పంగులూరు, నవంబరు 13(ఆంధ్రజ్యోతి): మండలంలోని చినమల్లవరం గ్రామ వీఆర్‌ఏ కొప్పోలు కోటేశ్వరరావు(60) బుధవారం రాత్రి అనారోగ్యంతో మృతి చెందాడు. సమాచారం తెలుసుకున్న తహసీల్దార్ సింగారావు గురువారం కోటేశ్వరరావు మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు. కుటుంబసభ్యులను పరామర్శించిన తహసీల్దార్ సింగారావు కోటేశ్వరరావు మట్టిఖర్చులకు రూ. 10వేల నగదును అందజేశారు. వీరివెంట వీఆర్‌వో బుల్లియ్య పాల్గొన్నారు.

రోడ్ల వెంబడి వ్యర్థాలు వేయకుండా ప్రజలకు అవగాహన

బల్లికురవ, నవంబరు13(ఆంధ్రజ్యోతి): గ్రామాలలో రోడ్ల వెంబడి వ్యర్థాలు వేయకుండా ప్రజలకు అవగాహన కల్పించాలని ఎంపీడీవో కుసుమకుమారి పంచాయతీ కార్యదర్శులకు సూచించారు. గురువారం బల్లికురవ - చెన్నుపల్లి రోడ్డులో చెరువు వద్ద రోడ్డు వెంబడి ఉన్న వ్యర్థాల తొలగింపు పనులను ఎంపీడీవో పరిశీలించారు. చెత్త సంపద కేంద్రాలు ఉన్న గ్రామాలలో రిక్షాల ద్వారా చెత్తను ప్రతి ఇంటి నుంచి సేకరించి అక్కడ పడవేయాలన్నారు. ఈ పరిశీలనలో పంచాయతీ కార్యదర్శి సుబ్రమణ్యం, టీడీపీ నాయకులు గొట్టిపాటి కిషోర్, గంగవరపు కాశీరావు పాల్గొన్నారు.

ఐదుగంటల పాటు నిలిచిన విద్యుత్ సరఫరా

●అర్ధరాతి శ్రమించిన విద్యుత్ సిబ్బంది

● డీఈఈ పర్యవేక్షణలో సాగిన పనులు

మార్టూరు, నవంబరు 13(ఆంధ్రజ్యోతి): మార్టూరు పట్టణంతో పాటు మండలంలోని రాజుపాలెం, డేగరమూడి, బల్లికురవమండలంలోని కె రాజుపాలెం గ్రామాలకు బుధవారం రాత్రి 7 గంటల సమయంలో విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. అరగంట లేదా గంట తర్వాత విద్యుత్ వస్తుందని ప్రజలందరూ బావించారు. కానీ రెండు గంటలైనా విద్యుత్ రాలేదు. ఎట్టకేలకు రాత్రి 12 గంటల సమయంలో మార్టూరు పట్టణంతో పాటు మిగిలిన గ్రామాలకు విద్యుత్ సరఫరా జరిగింది. అందుకు ఐదు గంటలు సమయం పట్టింది. మార్టూరు సబ్ డివిజన్ పరిధిలో 132 కెవి సబ్ స్టేషన్,రాజుగారిపాలెం రోడ్‌లో ప్రభుత్వ జూనియర్ కాలేజీ వద్ద, హర్షనర్సరీ వద్ద,మరో చోట 33 కేవీ విద్యుత్ లైన్ కండక్టర్‌లు తెగిపోయాయి. ఒకే సారి 4 చోట్ల విద్యుత్ లైన్‌లు తెగిపోవడంతో సడన్‌గా విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. వెంటనే విద్యుత్ సరఫరాను పునరుద్ధరించే చర్యలను సబ్ డివిజన్ డీఈఈ ఎం. సురేంద్రబాబు చేపట్టారు. ఆయన స్వయంగా ఏఈ బి.వీరాంజనేయులు,లైన్ ఇన్‌స్పెక్టర్ అంజయ్య,లైన్ మెన్ గుంటూరు సుబ్బారావు,11 మంది సబ్ స్టేషన్ సిబ్బందితో ప్రత్యేకంగా క్రేన్‌ను,ట్రాక్టరును తెప్పించి తెగిపడిన లైన్లను పునరుద్ధరించి విద్యుత్‌ను సరఫరా చేశారు.



అర్ధరాత్రి సమయంలో క్రేన్ సహాయంతో విద్యుత్ తీగలను కలుపుతున్న విద్యుత్ సిబ్బంది



గ్రానైట్ పరిశ్రమల యజమానులతో మాట్లాడుతున్న కెనరా బ్యాంకు ఏజీఎం వరప్రసాద్

పరిశ్రమలకు పెద్ద ఎత్తున రుణాలు

● కెనరా బ్యాంకు ఏజీఎం వరప్రసాద్

బల్లికురవ, నవంబరు13(ఆంధ్రజ్యోతి): పరిశ్రమల ఏర్పాటుకు పెద్ద ఎత్తున రుణాలను అందించేందుకు కెనరా బ్యాంకు సిద్ధంగా ఉందని ఆ శాఖ విజయవాడ సర్కిల్ కార్యాలయ ఏజీఎం వరప్రసాద్ పేర్కొన్నారు. గురువారం మండలంలోని వేమవరం గ్రామం వద్ద ఉన్న లలిత ఇండస్ట్రీస్‌లో గ్రానైట్ ఫ్యాక్టరీల యజమానులతో కెనరా బ్యాంకు అధికారులు సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఫ్యాక్టరీల యజమానుల సంఘం తరపున అధ్యక్షుడు చిట్టిపోతు మస్తానయ్య వారిని ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఏజీఎం మాట్లాడుతూ వేమవరం పరిధిలో ఉన్న నూతన ఫ్యాక్టరీలకు రూ. 20 కోట్ల రుణాలను అందిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో సులభ్ ఇన్‌చార్జి శ్యామలా, డీఎం జానీ, ఫ్యాక్టరీల యజమానులు పాల్గొన్నారు.



పాలిథిన్ కవర్లతో తయారు చేసిన ప్రత్యేక గౌనులో బాలిక



న్యూస్ పేపర్లతో తయారు చేసిన ప్రత్యేక గౌనులో బాలిక

ఫ్యాన్సీడ్రస్ పోటీలలో అలరించిన బాలికలు

మార్టూరు,నవంబరు13(ఆంధ్రజ్యోతి): బాలలదినోత్సవాన్ని పురస్కరించుకొని గురువారం మార్టూరులోని రాయల్‌స్కూల్‌లో బాలబాలికలకు ఫ్యాన్సీడ్రస్ పోటీలను నిర్వహించారు.ఈ సందర్భంగా పలువురు బాల బాలికలు ప్రత్యేక అలంకరణలతో,వివిధ వేషధారణలతో అందరినీ అలరించారు.అయితే వారిలో 3 వతరగతి ఇంగ్లీషు మీడియం చదువుతున్న బాలిక ఎస్‌కె నఫీసా మాహిన్ పాలిథిన్ కవర్లతో ప్రత్యేకంగా తయారుచేసిన గౌనును, 5 వతరగతి ఇంగ్లీషు మీడియం చదువుతున్న బాలిక ఎస్‌కె సనాఫర్హత్ న్యూస్ పేపర్లతో ప్రత్యేకంగా తయారుచేసిన గౌనును ధరించి పోటీలలో ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు.ఈ సందర్భంగా స్కూల్ కరస్పాండెంట్ పేరం రవీంద్రబాబు మాట్లాడుతూ విభిన్నమైన ఆలోచనలతో,మనకంటూ ఒక ప్రత్యేక గుర్తింపు వచ్చే విధంగా ఫ్యాన్సీడ్రస్ పోటీలలో చిన్నారుల వేషధారణలు వారి మనస్సుల్లో జీవితాంతం మెదులుతూనే ఉంటాయన్నారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

పర్చూరు, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి) : మద్యం మత్తులో ఎలుకల మందుతిన్న వ్యక్తి గుంటూరు ప్రభుత్వ వైద్యశాలలో చికిత్స పొందుతూ గురువారం మృతిచెందాడు. పర్చూరు శ్రీ సాయిబాబా ఆలయ సమీపంలో నివాసం ఉంటున్న మాచినేని నారాయణ(60) ఈనెల 9న తన నివాసంలో ఎలుకల పేస్టు తిని 108కు ఫోన్‌చేశాడు. వెంటనే అతన్ని పర్చూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. పరిస్థితి విషమంగా ఉంటంతో ప్రాథమిక చికిత్స అనంతరం గుంటూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. మృతునికి భార్య, కుమార్తె, కుమారుడు ఉన్నారు.

వేటపాలెం రైల్వేస్టేషన్‌లో కేబుల్ వైర్లు దగ్ధం

వేటపాలెం(చీరాల), నవంబరు 13 (ఆంధ్రజ్యోతి) : వేటపాలెం రైల్వే స్టేషన్‌కు సంబంధించి పాడయిన కేబుల్ వైర్లకు గురువారం రాత్రి మంటలు అలుముకుని వ్యాపించాయి. ఈక్రమంలో పెద్ద ఎత్తున పొగలు, మంటలు చెలరేగడంతో స్థానికులు, రైల్వే సిబ్బంది కలిసి వాటిని అదుపు చేశారు. అయితే మంటలు ఎలా జరిగాయన్నది తెలియరాలేదు. అయితే దీనిపై రైల్వే, జీఆర్పీ పోలీసులను వివరణ కోరగా, ఘటన రైల్వే పరిధి కాదని స్పష్టం చేశారు



కాలిపోతున్న కేబుల్ వైర్లు